ప్రధాని పిలుపు మేరకు పాల్గొనాలన్న సిఎం కెసిఆర్

లైట్లు ఆర్పేయడంతో గ్రిడ్‌కు ప్రమాదం లేదన్న ప్రభాకర్ రావు

హైదరాబాద్,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): ప్రధాని మోడీ పిలుపు మేరకు దీపాలు వెలగించే కార్యక్రమంలో పాల్గొనాలని సిఎం కెసిఆర్ ప్రజలను కోరారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధాని పిలుపుతో ఐక్యత చాటాలన్నారు. ఇదిలావుంటే ఆదివారం ఒకేసారి లైట్లు ఆర్పేయడం వల్ల పవర్‌గ్రిడ్‌పై ఎలాంటి ప్రభావం పడదని ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్ రావు చెప్పారు. అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ గ్రిడ్‌కు ఎలాంటి సమస్య రాకుండా అప్రమత్తంగా ఉన్నామన్నారు. లైట్లు ఆర్పేస్తే గ్రిడ్ కుప్పకూలుతుందని జరుగుతున్న ప్రచారంలో వాస్తవంలేదని కొట్టిపారేశారు. తెలంగాణ గ్రిడ్ సురక్షితంగా ఉందన్నారు. కరోనా కట్టడికి ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపును విజయవంతం చేయండని సూచించారు. కరోనాపై మనం విజయం సాధించాలన్నారు.

నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 5-4-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 215 | పేజీలు: 4 | వెల: రూ.1/-

ఆకలితో ఉండొద్దన్న సంకల్పానికి చేయూతనివ్వాలి : మంత్రి సత్యవతి

మహబూబాబాద్ ,ఏప్రిల్ 4: ఈ రాష్ట్రంలో ఎవరూ ఆకలితో ఉండొద్దన్న ప్రభుత్వ సంకల్పానికి అందరూ చేయూతనివ్వాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు.

మహబూబాబాద్‌లోని వీధి బాలలు, వలస కూలీలకు మంత్రి నేడు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యవతి మాట్లాడుతూ... ప్రపంచ మహమ్మారి కరోనా వైరస్ కట్టడిలో భాగంగా ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అత్యవసరమైతే తప్ప ఎవరూ రోడ్లపైకి రావొద్దన్నారు.

లాక్‌డౌన్ నేపథ్యంలో ఈ రాష్ట్రంలో ఉన్నవారెవరూ కూడా ఆకలకి, ఇతర వసతులు లేక ఇబ్బంది పడొద్దని సీఎం కేసీఆర్ అన్ని రకాల చర్యలు చేపట్టారన్నారు. రాష్ట్రంలో కరోనా కట్టడికి అన్ని వర్గాలవారు సహకరిస్తున్న నేపథ్యంలో వలస కూలీలు, వీధి బాలలు, దినసరి కూలీల వంటి వారిని ఆదుకునేందుకు దాతలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఈ రాష్ట్రంలో ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదన్న సీఎం కేసీఆర్ సంకల్పానికి అందరూ బాసటగా నిలవాలని మంత్రి కోరారు.

ప్రధాని పిలుపు మేరకు జ్యోతి వెలగించండి

ఇది పాజిటివ్ ఎనర్జీ ఇస్తుంది

హైదరాబాద్,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): నరేంద్ర మోది పిలుపు మేరకు ఆదివారం జ్యోతి వెలగించాలన్న పిలుపును భారత్ ప్రధాని పిలుపుగా భావించి ప్రజలందరు స్వచ్ఛందంగా పాటించాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ ప్రతినిధి మేడా శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. భారతదేశానికి ఆ దైవ శక్తి వుందని నిరూపించాలన్నారు. కరోనా ప్రభావాన్ని తరిమివేయటానికి భారత ప్రధాని పిలుపు మేరకు భారతీయులందరు పూర్తి మతసామ రస్యంతో ఆదివారం రాత్రి 9-00 గంటలనుండి 9-09 నిమిషముల వరకు స్వచ్ఛమైన సద్బుద్ధితో ప్రార్థిస్తే కోరుకున్న సంకల్పం సిద్ధిస్తుందన్నారు. ఈ తరహా సంకల్పం నెరవేరునట్లు పురాతన ఉపనిష త్తులలో చారిత్రిక ఆధారాలు ఉన్నాయ న్నారు. కరోనా ప్రభావం మానవ తప్పిద మా, ఏదైనా కుట్ర వుందా అనే అంశాలను ప్రస్తుతం ప్రక్కన పెట్టి స్వచ్ఛమైన ఒకే ఒక్క ఉక్కు సంకల్పంతో ఆ రోజు మత రహిత సంకల్ప దీక్షకు భారతీయులందరు పూర్తి నిబద్ధతతో సంకల్పించాలని అన్నారు.

మన శాస్త్రజ్ఞులు ఎన్ని ప్రయత్నాలు చేసినా, మన ప్రభుత్వాలు ఎంత కృషి చేసినా, వైద్యులు, వైద్య సిబ్బంది, పోలీస్, రక్షక దళాలు ఎంత శ్రమించినా అందుకు ప్రజల స్వచ్ఛమైన హృదయ సహకారం కూడా అవసరం అని భావించాలన్నారు. ఒకవేళ చైనా కరోనా కుట్ర మూలాలు వున్నా, మరే కారణాలు వున్నా ఖచ్చితంగా బహిర్గతం అవుతుంది. ప్రజల పాజిటివ్ ఎనర్జీ సైతం ప్రకృతికి తోడుగా నిలిస్తే వైరస్ ప్రభావం త్వరగా తగ్గుతుంది. త్వరగా ప్రపంచ ప్రజలు రక్షింప బడతారు.సనాతన స్వచ్ఛమైన సంకల్పం, సంప్రదాయం ముందు ఏ విష వైరస్ అయినా తల వంచాల్సిందేనని అన్నారు. త్వరలో ఈ వైరస్ ప్రభావం తగ్గుతుంది. మరో 10 ఏళ్ల లోపు మరో విష వైరస్ పుడుతుంది.ఈ విష వైరస్ ప్రమాదం నుండి మన సమాజం, మన బిడ్డలు, భావితరాల వారు రక్షింపబడాలి అంటే మనం సనాతన సాంప్రదాయాలకు , పర్యావరణ రక్షణకు ప్రతి మనిషి నడుం బిగించాలన్నారు. కొంతమంది రాజకీయ కోణంలోను, మతపరం గాను 5 తేదీన జ్యోతి వెలిగించే చర్యను వ్యతిరేకిస్తున్నారని అన్నారు. జ్యోతి వెలిగించటం, చప్పట్లు కొట్టటం కూడా ఒకరకమైన సైన్స్ అని విమర్శికులు గ్రహించాలన్నారు. కలుషిత సమాజం వైపు దారిమళ్ళకుండా ప్రతి భారతీయుడు శ్రమించి సైనికుని వలే మనల్ని మనం కాపాడుకోవాలన్నారు.



తెలంగాణ వ్యయసాయ శాస్త్రవేత్తల అసోసియేషన్ డైరీని,క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి నిరంజన్ రెడ్డి

దేశవ్యాప్తంగా కరోనాకు 68 మంది మృతి

2,902కు చేరిన బాధితుల సంఖ్య

తెలంగాణ,ఎపిల్లోనూ క్రమేపి పెరుగుతున్న సంఖ్య

మహారాష్ట్ర,తమిళనాడుల్లోనూ ప్రకంపనలు

ఇంకా పూర్తిగా దొరకని ఢిల్లీ తగ్లిబీ జమాత్ సభ్యులు

గాలింపు ముమ్మరం చేసిన పోలీస్ అధికారులు

న్యూఢిల్లీ,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): భారత్‌లో కరోనా కేసులు పెరుగుతున్నాయి. దేశ వ్యాప్తంగా కరోనా కేసుల సంఖ్య 2,902కు చేరింది. కరోనాతో ఇప్పటివరకు 68 మంది మృతి చెందారు. దేశ వ్యాప్తంగా గత 12 గంటల్లో 355 కేసులు నమోదయినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించింది. తమిళనాడు, మహారాష్ట్రల్లో కేసుల సంఖ్య పెరుగుతోంది. అలాగే తెలంగాణ,ఎపిల్లోనూ సంఖ్య క్రమేపి పెరుగుతోంది. ఇప్పటివరకు దేశ వ్యాప్తంగా కరోనా నుండి 229 మంది కోలుకున్నట్లు తెలిపింది. అత్యధికంగా మహారాష్ట్రలో 400 కు పైగా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కర్నాటకలో లాక్‌డౌన్ ఇప్పుడిప్పుడే ఫలితాన్నిస్తుంది. రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య మొదటి రెండు వారాలతో పోలిస్తే తగ్గింది. శుక్రవారం 13 మంది శాంపిల్స్ పంపగా 10మందికి నెగిటివ్ రిపోర్టు వచ్చింది. కర్నాటక నుండి ఢిల్లీ మత ప్రార్థనలకు 1500 మంది వెళ్లారని అధికారులు భావిస్తున్నారు. అందులో 20శాతం మంది కరోనా బారినపడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఇప్పటి వరకు కర్నాటకలో 128 కరోనా కేసులు నమోదుకాగా, 11 మందిని డిశ్చార్జ్ చేశారు. నలుగురు ప్రాణాలు కోల్పోయారు. అయితే వైరస్ సంక్రమించినవారిలో 2650 కేసులు యాక్టివ్‌గా ఉన్నట్లు చెప్పింది. 183 మంది హాస్పటళ్ల నుంచి డిస్‌చార్జ్ అయ్యారు. తాజాగా కర్నాటక, రాజస్థాన్‌లో ఒక్కొక్కరు మృతి చెందారు. మధ్యప్రదేశ్‌లోని చింద్వారాలో 36 ఏళ్ల వ్యక్తి కోవిడ్19 వ్యాధితో మృతిచెందాడు. దీంతో ఆ రాష్ట్రంలో మరణించిన వారి సంఖ్య 9కి చేరుకున్నది. 155 పాజిటివ్ కేసులు ఉన్నాయి. మహారాష్ట్రలో 2వ తేదీన చనిపోయిన వ్యక్తికి కరోనా పాజిటివ్ లక్షణాలు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. లాక్‌డౌన్ ఆంక్షలను ధిక్కరించి.. మార్నిగ్ వాక్‌కు వెళ్లిన 41 మంది కొచ్చి పోలీసులు అరెస్టు చేశారు. తబ్లిగీ జమాత్ వెళ్లి వచ్చిన వారు తక్షణమే 104 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని, వారికి చికిత్సను అందిస్తామని ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ తెలిపారు. ప్రభుత్వం మీకు పూర్తి అండగా ఉంటుందన్నారు. జమాత్ పాల్గొన్న విదేశీయుల్లో చాలా మందిని గుర్తించి నప్పటికీ, కొంతమంది ఆచూకీ ఇంకా చిక్కలేదు. దీంతో దేశవ్యాప్తంగా వారికోసం అధికార యంత్రంగా ముమ్మరంగా గాలింపుచేప్పటింది. న్యూఢిల్లీలోని మర్కజ్‌లో తగ్లిబీ జమాత్ నిర్వహించిన ప్రార్థనలు ఇప్పుడు కరోనా కేంద్రబిందువుగా తయారయ్యాయి. ఇందులో పాల్గొన్న వేలమంది కరోనా పాజిటివ్‌లుగా గుర్తించారు. వీరివల్ల ఇంకెతమంది ఈ మహమ్మారి బారిన పడ్డారనే విషయం ఇప్పుడు పాలకులను ఆదోళనలకు గురిచేస్తున్నది. జమాత్ ప్రార్థనల్లో పాల్గొన్నవారిలో కనిపించకుండా పోయిన 187 మంది విదేశీయులు, 24 మంది భారతీయులకోసం అధికారులు ముమ్మంగా గాలిస్తున్నారు. ప్రార్థనల అనంతరం వీరంతా దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలివెళ్లారు. ఇప్పుడు ఇదే అధికారులకు సమస్యగా మారింది. శంలో కొత్తగా నమోదవుతున్న కేసుల్లో జమాత్ ప్రార్థనల్లో పాల్గొన్నవారు, వారితో సంబంధం ఉన్నవారే అధికంగా ఉన్నారు. దీంతో కనిపించకుండా పోయినవారు ఇప్పటివరకు ఎంతమందితో కాంటాక్ట్ అయ్యారనే విషయం పెద్ద ప్రశ్నగా మారింది.

మహారాష్ట్రలో పెరుగుతున్న కరోనా కేసులు

తీవ్రత ఉన్న ప్రాంతాల్లో లాక్‌డౌన్ పొడిగిస్తామన్న మంత్రి

విధుల్లో ఉన్న పోలీసులకు మాస్కులు అందచేత

ముంబై,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ ప్రభావం ఎక్కువగా కనిపిస్తున్న మహారాష్ట్రలో కొత్తగా 47 కేసులు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య శనివారంనాటికి 537కు చేరినట్టు మహారాష్ట్ర ఆరోగ్య శాఖ తెలిపింది. తాజాగా నమోదైన 47 కేసుల్లో 28 కేసులు ముంబై నుంచి, థానే జిల్లా నుంచి 15, పుణె, అమ్రావతి, పింప్రి చించ్వాడ్ నుంచి ఒక్కో కేసు ఉంది. కోవిడ్-19 ప్రభావం మహారాష్ట్రపై ఎక్కువగా ఉందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ శనివారం ప్రకటించింది. దేశవ్యాప్తంగా గత 12 గంటల్లో కొత్తగా 355 కేసులు నమోదు కావడంతో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 2,902కు చేరుకుందని పేర్కొంది. వీటిలో యాక్టివ్ కేసుల సంఖ్య 2,650 కాగా, 184 మందికి వ్యాధి నయం కాడం లేదా వారిని డిశ్చార్చ్ చేయడం జరిగింది. కాగా, తాజా లెక్కల ప్రకారం కరోనా మృతుల సంఖ్య 68కి చేరింది. మరోవైపు కరోనా లాక్‌డౌన్ పొడిగింపుపై మహారాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి రాజేష్ తోపే సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశవ్యాప్తంగా విధించిన కరోనా లాక్‌డౌన్ ఏప్రిల్ 14వతేదీన ముగియనున్న నేపథ్యంలో కరోనా అధికంగా ప్రబలుతున్న నగరాల్లో లాక్‌డౌన్‌ను పొడిగిస్తామని వైద్యశాఖ మంత్రి రాజేష్ తోపే చెప్పారు. మహారాష్ట్రలో ఒక్కరోజే 67 కరోనా పాజిటివ్ కేసులు వెలుగుచూశాయి. దీంతోపాటు ఒక్క ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతంలో ఒక్కరోజే 53 కేసులు బయటపడ్డాయి. మహారాష్ట్రలో కరోనా వల్ల ఆరుగురు మరణించగా, వీరిలో ముంబై నగరానికి చెందిన వారే నలుగురున్నారు. ధారావీకి మురికివాడకు చెందిన 56 ఏళ్ల వ్యక్తి కరోనాతో మరణించారు. ఈ నేపథ్యంలో కరోనా ప్రాబల్య నగరాల్లో లాక్‌డౌన్ గడవును పొడిగించాలనేది తన వ్యక్తిగత అభిప్రాయమని మంత్రి రాజేష్ తోపే చెప్పారు. కరోనా కేసులు ప్రబలిన నగరాలైన ముంబైతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో కొన్ని వారాల పాటు లాక్‌డౌన్‌ను పొడిగించే అవకాశముందని మంత్రి రాజేష్ వివరించారు. మహారాష్ట్రలో 490 కేసులు బయటపడగా, ఇందులో 278 ముంబై నగరంలోనివే కావడం విశేషం. కరోనా వ్యాప్తిని నివారించడం కోసం దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ కొనసాగుతున్నది. ఈ లాక్‌డౌన్ నిబంధనలను ఎవరూ ఉల్లంఘించకుండా చూడటంలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారు. అంతేగాక నిత్యం రోడ్లపై ఉండి విధులు నిర్వహించే వీరు ఒక రకంగా కరోనాకు ఎదురు వెళ్లి పోరాటం చేస్తున్నట్టే. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వం వారిని కరోనా మహమ్మారి బారిన పడకుండా చూడటం కోసం రక్షణ సామాగ్రిని అందజేసింది. మహారాష్ట్ర హోంమంత్రి అనిల్ దేశ్‌ముఖ్ స్వయంగా పోలీసులకు మాస్కులు, శానిటైజర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన అనిల్ దేశ్‌ముఖ్.. కరోనా విస్తరిస్తున్న సమయంలో బాధ్యతగా విధులు నిర్వహిస్తున్న పోలీసులను మనం కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

పోలీసుల ఆధ్వర్యంలో అంబులెన్స్ సేవలు

ప్రకటించిన సైబరాబాద్ సిపి సజ్జన్నార్

హైదరాబాద్,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): నగరంలోని సైబరాబాద్ జోన్ పరిధిలో అత్యవసర సేవలకు అంబులెన్స్ సర్వీసులను ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. గర్భిణీలు, వృద్ధులు, అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లేవారికి ఈ అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు 94906 17440, 94906 17431. సంప్రదించాల్సిన ఈమెయిల్ ఐడీని కూడా అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలో లాక్‌డౌన్ ఆంక్షలు కొనసాగు తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రోగులు, చికిత్స అవసర మయ్యే వ్యక్తుల సౌకర్యార్థం పోలీసు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పెరుగుతున్న కరోనా సంఖ్య

మర్కజ్ వెళ్లి వచ్చిన వారితోనే విస్తరిస్తున్న వైరస్

ఇంటింటి సర్వేతో తనిఖీలు ముమ్మరం చేసిన ఎపి సర్కార్

ఆందోళన కలిగిస్తున్న ఆశావర్కర్లపై దాడి ఘటనలు

తెలంగాణలో 11కు చేరిన మృతుల సంఖ్య

హైదరాబాద్,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): తెలుగు రాష్ట్రాల్లో కరోనా బాధితుల సంఖ్య క్రమంగా పెరగడంతో ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాయి. ఢిల్లీ మర్కజ్ న ఉంచి వచ్చిన వారి వల్లనే కేసుల సంఖ్య పెరగడం, వారిలోనే మరణాలు ఉండడంతో ప్రభుత్వాలు అప్రమత్తం అయ్యాయి. ఎపిలో ఇంటింటి సర్వేతో వారిని గుర్తించే పని తీవ్రం చేశారు. అలాగే తెలంగాణలోనూ వివిధ జిల్లాల్లో ఆశా కార్యకర్తలు ఇల్లిల్లూ తిరుగుతూ వివరాలు సేకరిస్తున్నారు. అయితే ఆదిబాద్, నిర్మల్ ,నిజామా బాద్ జిల్లాల్లో ఆశా కార్యకర్తలపై దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టినా.. ఢిల్లీ మర్కజ్ మత ప్రార్థనలు దేశాన్ని కుదిపేశాయి. గత వారం వరకు పరిస్థితి సాధారణంగానే ఉన్నా.. మర్కజ్‌కు హాజరైన వారికి కరోనా వైరస్ సోకడంతో వాతావరణం ఒక్కసారిగా మారింది. ప్రజల్లో ఆందోళన పెరిగిపోయింది. ముఖ్యంగా దేశ వ్యాప్తంగా గడిచిన నాలుగురోజుల్లో సంభవించిన మరణాల్లో ఢిల్లీ మర్కజ్‌కు వెళ్లివచ్చిన వారే అధికంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా తెలంగాణలో ఇప్పటి వరకు నమోదైన 11 మరణాల్లో ఇద్దరు మినహా మిగతావారంతా అక్కడికి వెళ్లివచ్చిన వారేకావడం పరిస్థితి తీవ్రతకు అర్థం వడతోంది. ఇక దేశ వ్యాప్తంగా నమోదవుతున్న మరణాల్లోనూ వారి సంఖ్యే ఎక్కువగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మరోవైపు తెలంగాణలో తాజాగా నమోదైన కేసులన్నీ ఢిల్లీ నుంచి వచ్చిన వారు, వారితో కాంటాక్ట్ అయిన వారే అత్యధికంగా ఉన్నారు. తాజాగా ఆదిలాబాద్, నిజామాబాద్‌లో శనివారం కొత్తగా వెలుగుచూసిన కరోనా పాజిటివ్ కేసుల కూడా ఢిల్లీ బాధితులే. ఇక ఆంధ్రప్రదేశ్‌లో శుక్రవారం మరణించిన కరోనా బాధితుడు కూడా ఢిల్లీ వచ్చిన వారే కావడం గమనార్హం. రాష్ట్రంలో నమోదైన పాజిటివ్ కేసుల్లో సింహ భాగం మర్కజ్ నుంచి వచ్చిన వారే ఉన్నారు. దీంతో రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు మరింత అప్రమత్తం అయ్యాయి. మత ప్రార్థనలకు వెళ్లిన వారిని నిర్బంధ కేంద్రాలకు పంపే చర్యలను వేగవంతం చేశాయి. ఇక తెలంగాణలో ఢిల్లీ మర్కజ్‌కు వెళ్లొచ్చిన వారు 1,030 మంది ఉన్నారని వైద్య ఆరోగ్యశాఖ ఇంతకుముందే ప్రకటించిన సంగతి తెలిసిందే. వారిలో దాదాపు 900 మందిని ఇప్పటివరకు గుర్తించి తమ అధీనంలోకి తీసుకున్నారు. వారి కుటుంబ సభ్యులను, వారితో కాంటాక్ట్ అయినవారిని కూడా కొందరిని గుర్తించారు. బుధవారం 300 మందికి పరీక్షలు నిర్వహించగా, 30 మందికి పాజిటివ్‌గా తేలింది. శుక్రవారం పరీక్షల్లో 75 మందికి పాజిటివ్‌గా తేలింది. దీంతో మొత్తం సంఖ్య 229కి చేరింది.

కరోనా కారక చైనాపై చర్య తీసుకోండి

ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలికి ఐసిజె వినతి

జెనీవా,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): కోవిడ్-19 మహమ్మారి ప్రపంచాన్ని వణికిస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయ న్యాయకోవిదుల మండలి ఐసీజే సంచలన డిమాండ్ చేసింది. ఈ వైరస్ జన్మస్థలమైన చైనాపై చర్యలు తీసుకోవాలని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలిని కోరింది. ప్రాణాంతక కరోనా వైరస్‌ను ప్రపంచంలో వ్యాపింపజేయడం ద్వారా మానవాళికి వ్యతిరేకంగా చైనా తీవ్రమైన నేరాలకు పాల్పడిందని ఆరోపించింది. ఈ వైరస్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది మరణించారని పేర్కొంది. ప్రపంచ దేశాలకు చైనా నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది. యూఎన్‌హెచ్‌ఆర్‌సీకి లండన్‌లోని ఐసీజే అధ్యక్షుడు, ఆలిండియా బార్ అసోసియేషన్ చైర్మన్ అదిష్ సీ. అగర్వాలా ఫిర్యాదు చేశారు. కోవిడ్-19ను వ్యాపింపజేయడం ద్వారా మానవాళికి పెను విపత్తు సంభవించడానికి చైనా కారణమైందని, అందువల్ల ప్రపంచ దేశాలకు అసాధారణ నష్టపరిహారం చెల్లించాలని చైనాను ఆదేశించాలని కోరారు. మరీ ముఖ్యంగా భారత దేశానికి భారీ నష్టపరిహారం చెల్లించాలని చైనాను ఆదేశించాలని డిమాండ్ చేశారు. కరోనా వైరస్ ప్రపంచ దేశాలకు వ్యాపించకుండా నిరోధించడంలో చైనా ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించిందని ఆరోపించారు. చైనా ప్రభుత్వ ఉదాసీనత వల్ల ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఏర్పడిందన్నారు. లక్షల కోట్ల డాలర్ల నష్టం జరిగిందని, భారత దేశంతోపాటు ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది నిరుద్యోగులయ్యారని తెలిపారు. ప్రపంచంలో పెద్దన్న స్థాయికి చేరాలనేది చైనా లక్ష్యమని, కోవిడ్-19ను మహమ్మారి వ్యాధిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించడం వెనుక ప్రధానంగా చైనా కుట్ర ఉందని ఆరోపించారు. జీవ సంబంధ యుద్ధం ద్వారా ప్రపంచంలోని ఇతర దేశాలను అణగదొక్కి, తాను ప్రపంచంలో పెద్దన్న స్థాయికి

చేరుకోవాలనేది చైనా లక్ష్యమని పేర్కొన్నారు. కరోనా వైరస్ గురించి ప్రపంచ ఆరోగ్య సంస్థను, ఇతర దేశాలను అప్రమత్తం చేయడంలో చైనా ప్రభుత్వం, నాయకులు తీవ్ర నిర్లక్ష్యం వహించారని, అసమర్థత ప్రదర్శించారని పేర్కొన్నారు. ఐక్య రాజ్య సమితి ఛార్టర్లు, మార్గదర్శకాలను ఉల్లంఘిస్తూ ఈ మహమ్మారి పట్ల చైనా వ్యవహరించిందని ఆరోపించారు.నోవల్ కరోనా వైరస్ గత ఏడాది నవంబరులో చైనాలోని వూహన్‌లో మొదట కనిపించిన సంగతి తెలిసిందే. ఇది ప్రపంచవ్యాప్తంగా సుమారు 12 లక్షల మందికి సోకినట్లు తాజా సమాచారం.

దండలేసి దండం పెడుతూ పోలీసుల వినతి

పాట్నా,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): కరోనా రక్కసిని కట్టడి చేయడానికి ప్రభుత్వాలు ఎన్నో చర్యలు చేపడుతున్నాయి. దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ అమల్లో ఉంది. దీంతో జనం మొత్తం ఇండ్లకే పరిమితమయ్యారు. అయితే కొంత మంది మాత్రం లాక్‌డౌన్ నిబంధనలను పట్టించుకోవడంలేదు. యథేచ్ఛగా రోడ్ల మీదకు వస్తూ పోలీసుల సహనానికి పరీక్ష పెడుతున్నారు. ఈ నేపథ్యంలో లాక్‌డౌన్ ఉల్లంఘనుల బుద్ధి మార్చడం కోసం బీహార్ పోలీసులు వినూత్న పంతా అనుసరిస్తున్నారు. శనివారం ఉదయం పట్నాలో రోడ్లకు మీదకు వచ్చిన వారికి పోలీసులు దండలు వేసి దండాలు పెట్టారు. దయచేసి లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించవద్దని విజ్ఞప్తి చేశారు. కరోనాతో మీకే కష్టం అంటూ వివరించారు. దయచేసి రాకండి అంటూ విజ్ఞప్తి చేశారు.

కరోనాతో బిడ్డకు జన్మనిచ్చిన డాక్టర్

న్యూఢిల్లీ,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): కరోనా పాజిటివ్ గర్భిణి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఘటన ఢిల్లీలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఢిల్లీ ఎయిమ్స్‌లో పని చేస్తున్న రెసిడెంట్ డాక్టర్‌తో పాటు ఆమె భార్యకు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయిన విషయం విదితమే. అయితే డాక్టర్ భార్య నిండు గర్భిణి. డాక్టర్‌తో పాటు ఆమెను ఇప్పటికే ఐసోలేషన్ వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆమెకు శుక్రవారం రాత్రి పురిటినొప్పులు వచ్చాయి. మొత్తానికి ఆమె పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఓ కరోనా పేషెంట్ బిడ్డకు జన్మనివ్వడం దేశంలో ఇదే తొలిసారి. తల్లీబిడ్డ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో పని చేస్తున్న ఇద్దరు డాక్టర్లకు, సర్దార్ వల్లభాయి హాస్పిటల్ డాక్టర్‌కు, ఢిల్లీ బస్తీ దవఖానాల్లో పని చేస్తున్న ఇద్దరు డాక్టర్లకు, క్యాన్సర్ ఆస్పత్రి వైద్యురాలికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయిన విషయం తెలిసిందే.

జ్యోతులు వెలిగిద్దం రండి

వాజ్‌పేయ్ కవితను జోడిస్తూ ప్రధాని మోడీ ట్వీట్

న్యూఢిల్లీ,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారిని తరిమికొట్టడానికి ఆదివారం ప్రజలందరూ తమతమ ఇళ్లల్లోని విద్యుత్ లైట్లన్నీ ఆపేసి, జ్యోతులు వెలిగించాలని ప్రధాని మోదీ పిలుపు నిచ్చిన విషయం విదితమే. అయితే దీనికి సంబంధించిన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి కవితా గానాన్ని ప్రధాని మోదీ శనివారం ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు... ఆ కవిత ఇదే...

రండి.. తిరిగి దీపాలను వెలిగిద్దాం...పట్టపగలే చిమ్మ చీకటి

నీడ చేతిలో ఓడిన సూరీడు ..అంతరాళల్లోని ప్రేమను పిండుకుందాం...

ఆరిన వత్తిని వెలిగిద్దాం...రండి... తిరిగి దీపాలను వెలిగిద్దాం.. అంటూ కవిత సాగుతుంది. మాజీ ప్రధాని వాజపేయి కవితా పంక్తులను ప్రధాని మోదీ ట్విట్టర్‌లో పోస్టు చేశారు. 5వ తేదీ ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో 9 నిమిషాలపాటు ప్రతి ఒక్కరూ తమతమ ఇళ్లవద్దనే ఉండి ఇళ్లల్లోని విద్యుత్ లైట్లన్నీ ఆపేసి, జ్యోతులు వెలిగించి, తమ ధృఢ సంకల్పాన్ని వెల్లడించాలి. చమురు దీపాలు లేదా కొవ్వొత్తులు, టార్చ్‌లైట్లు లేదా సెల్‌ఫోన్ ఎ÷-లాష్‌లైట్లు... ఏవి వీలైతే అవి వెలిగించి, కరోనా అనే చీకటిని, ఆ మహమ్మారిని తరిమేద్దాం అనే సంకల్పం తీసుకోవాలి. నా కోసం మీ విలువైన సమయంలో ఓ 9 నిమిషాలు కేటాయించండి. జనతా స్ఫూర్తిని మరోమారు చాటండి' అని భారత ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

చరిత్రలో నేటినిజం

కం॥ 'లగ్జరి' నెరుగక-జనదగు
దర్జాలము లానసతము దీనజనులనే
ఎగ్జాంపులుగా నిలిపెడి
'జగ్జీవనరాము' వెలుగు జనులమనములనే॥

(ఏప్రిల్ 5 జగ్జీవనరాం జయంతి..)

-రాధశ్రీ

సెల్: 9494481210

ఆహార భద్రతకు భరోసా కల్పించాలి...

నేటినిజం
ఆదివారం 5-4-2020

ప్రపంచ వ్యాప్తంగా పుడుతున్న పిల్లల్లో 18 శాతం మంది భారత్‌లోనే జన్మిస్తున్నారని, శిశు మరణాల సంఖ్య కూడా మన దేశంలోనే అత్యధికంగా ఉంటోందని 'యునిగ్మె' నివేదిక తేటతెల్లం చేసింది. శిశు మరణాలలో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో నైజీరియా, పాకిస్తాన్, కాంగో, ఇథియోపియా దేశాలు నిలిచాయి. 2017లో మన దేశంలో 6.05 లక్షల మంది నవజాత శిశువులు మరణించగా, అయిదు నుంచి పద్నాలుగేళ్ల వయసు పిల్లల్లో 1.52 లక్షల మంది మృత్యువాత పడ్డారు. 2016లో మన దేశంలో 8.67 లక్షల మంది చిన్నారులు మరణించగా, 2017లో ఆ సంఖ్య స్వల్పంగా 8.02 లక్షలకు తగ్గింది. 2016లో పుట్టిన ప్రతి వెయ్యిమంది శిశువుల్లో 44 మంది మరణించగా, గత ఏడాది ఆ సంఖ్య 40కి తగ్గింది. అయిదేళ్ల వయసు లోపు పిల్లలు గత ఏడాది 9.89 లక్షల మంది మరణించారు. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే గత ఏడాది పదిహేనేళ్ల లోపు వయసు పిల్లల్లో 63 లక్షల మంది మరణించారు. వీరిలో అయిదేళ్ల లోపు వయసు గల చిన్నారుల సంఖ్య 54 లక్షలు. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే ప్రతి అయిదు సెకన్లకు ఒకరు చనిపోతుండగా, భారత్‌లో ప్రతి రెండు నిమిషాలకు ముగ్గురు శిశువులు విగతజీవులవుతున్నారు. అనేక దేశాలతో పాటు భారత్‌లోనూ పోషకాహార లేమితో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. పోషకాహారం అందక శుష్కించిపోతున్న వారి సంఖ్య పెరుగుతూ, దాదాపు దశాబ్దం క్రితం నాటి పరిస్థితులు పునరావృతం అవుతున్నాయని, ప్రతి తొమ్మిది మందిలో కనీసం ఒకరు పౌష్టికాహార లేమితో సతమతమవుతున్నారని 'ప్రపంచ ఆహార భద్రత- పౌష్టికాహార స్థితి- 2018' నివేదిక చెబుతోంది. అయిదేళ్ల లోపు చిన్నారుల్లో వయసుకు తగ్గ ఎత్తు, ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడానికి పోషకాహార లోపమే ప్రధాన కారణమవుతోంది. భారత్‌లో అయిదు నెలల లోపు శిశువుల్లో కేవలం 54.9 శాతం మందికి మాత్రమే తల్లిపాలు అందుతుండడం మరో ఆందోళనకర పరిణామం.

గత ఏడాది నాటి గణాంకాలను పరిశీలిస్తే- ప్రపంచ వ్యాప్తంగా 82 కోట్ల మందికి సరైన పోషకాహారం అందడం లేదు. 2016లో ఈ సంఖ్య 80 కోట్లుగా ఉండేది. అధిక వర్షాలు, అత్యధిక ఉష్ణోగ్రతలు, తుపానులు, వరదలు,కరవు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల విశ్వవ్యాప్తంగా ఆకలి బాధితుల సంఖ్య పెరుగుతోంది. అయిదేళ్ల లోపు వయసు పిల్లల్లో 22.2 శాతం మంది పోషకాహారం లభించక అలమటిస్తున్నారు. భారత్ సహా అనేక వర్ధమాన, పేద దేశాలను ఈ విపత్కర పరిస్థితి వెంటాడుతోందని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. వరుసగా గత మూడేళ్ల నుంచి ఆకలి బాధలు పెరగడంతో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రపంచ దేశాలన్నీ కార్యోన్ముఖం కావాలని ఐరాస పిలుపునిచ్చింది. 2030 నాటికి భూమిమీద ఎక్కడా ఆకలి కేకలు లేకుండా చేయాలన్నా, శిశు మరణాలను తగ్గించాలన్నా ఆహార భద్రతకు భరోసా కల్పించాలని, ఇందుకు ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ అవసరమని ఐరాస నొక్కి చెబుతోంది. భారత్ వంటి దేశాల్లో పేద కుటుంబాలు తమ ఇళ్లలోని ఆడపిల్లల కంటే మగపిల్లలకే మెరుగైన ఆహారం ఇవ్వడానికి ప్రాధాన్యత ఇవ్వడాన్ని ఐరాస ఆక్షేపించింది. వైద్యుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రసవాలు జరిగేలా చూడడం, రోగ నిరోధక శక్తి పెంచడం, పోషకాహారం పంపిణీ చేయడం, పిల్లల కోసం ప్రత్యేక వైద్యశాలలను ఏర్పాటు చేయడం వంటి చర్యలను అరకొరగా చేపట్టడంతో ఆశించిన ఫలితాలు కానరావడం లేదు. ఆకలిని రూపుమాపడం, బాలలందరికీ పోషకాహారం అందజేయడం కార్యరూపం దాలిస్తేనే చిన్నారుల మరణాలకు అడ్డుకట్ట పడుతుందని నిపుణులు చేస్తున్న హెచ్చరికలు ప్రభుత్వాల చెవిన పడడం లేదు. వ్యూహాత్మక ప్రణాళికలతో బాలలను రోగాల బారి నుంచి గట్టెక్కించడం తమ తక్షణ కర్తవ్యమని మన పాలకులు గుర్తించాలి.

గుజరాత్‌లో వ్యాపారి ఆత్మహత్య

స్వీయ నిర్బంధంలో ఉంటూ దుశ్చర్య

గాంధీనగర్,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): స్వీయ నిర్బంధంలో ఉన్న ఓ కరోనా అనుమానితుడు ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్‌కు చెందిన ఓ పారిశ్రామికవేత్త వినోదాబాయ్ (44) కరోనా లక్షణాలతో కనిపిండంతో వైద్యులు అతన్ని ఆస్పత్రికి తరలించి పరీక్షలు నిర్వహించారు. అయితే వీటిల్లో ఆయనకు కరోనా నెగెటివ్ అని వచ్చింది. అయినా కూడా 14 రోజుల పాటు స్వీయ నిర్బంధంలో ఉండాలని వైద్యులు అతనికి సూచించారు. ఈ క్రమంలోనే వినోదాబాయ్ తన నివాసంలోన్నే క్వారెంటైన్ సెంటర్‌గా మార్చుకున్నారు. దాదాపు 13 రోజుల పాటు నిర్బంధంలో కొనసాగిన అతను శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డారు. రాత్రి సమయంలో ఇంటి సీలింగ్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆయన మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరకుని కేసు నమోదు చేసుకుని, దర్యాప్తును ప్రారంభించారు. లాక్‌డౌన్ నేపథ్యంలో వ్యాపారంలో నష్టాలు వచ్చాయన్న కారణంగా ఆత్మహత్య చేసుకుని ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

విజయవాడలో మొత్తం 16 కరోనా కేసులు

మృతి చెందిన వ్యక్తి ప్రాంతంలో సిపి పర్యటన

విజయవాడ,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): విజయవాడలో మొత్తం 16 కరోనా కేసులు నమోదయ్యాయని నగరపోలీస్ కమిషనర్ ద్వారకా తిరుమల రావు తెలిపారు. అందులో 11 కేసులు ఢిల్లీ నిజాముద్దీన్ సమావేశంలో పాల్గొన్నవారేనని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం కరోనా పాజిటివ్ సోకి మృతిచెందిన వ్యక్తి ప్రాంతాన్ని సీపీ పరిశీలించారు. విజయవాడ కుమ్మరిపాలెం సెంటర్‌లోని ప్రజల్లో ధైర్యం నింపేందుకు కమిషనర్ ఈ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో తొలి కరోనా మరణం విజయవాడలో జరగడం బాధాకరమన్నారు. ముందుగానే హెచ్చరించామని, అయినా వారు పట్టించుకోక

పోవటం, అతనికి ఇతర వ్యాధులు ఉండటంతో మరణించాడని సీపీ పేర్కొన్నారు. కరోనా పాజిటివ్ తేలిన వ్యక్తుల కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఢిల్లీ సదస్సుకు వెళ్లి వచ్చిన కుమ?మరిపాలెం సెంటర్‌కు చెందిన వ్యక్తితోపాటు కుటుంబ సభ్యులకు పాజిటివ్ వచ్చిందని తెలిపారు. వ్యక్తి తండ్రి చనిపోయారన్నారు. తాను ఎవరిని తప్పు పట్టడం లేదని, ఢిల్లీ సదస్సుకు వెళ్లొచ్చిన వారిని కలిసిన వారు తప్పనిసరిగా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. చాలా మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకుంటున్నారని, మిగతావారు కూడా ముదుకు రావాలని కోరారు. మీరు, మీ కుటుంబ సభ్యుల ఆరోగ్యమే తమకు ముఖ్యమని సీపీ తెలిపారు. విజయవాడ కొన్ని ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించామని, మరికొన్ని ప్రాంతాలను రెడ్‌జోన్‌గా ప్రకటించామని పేర్కొన్నారు.

లెట్లు ఆర్పేసే సమయంలో నిద్రొస్తే పోతా..

మీడియా సమావేశంలో మమత వ్యంగ్యాస్త్రాలు

కోల్‌కతా,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): ప్రధాని నరేంద్ర మోదీ 'లైట్ దియా' పిలుపుపై రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యంగ్యంగా స్పందించారు. ప్రధాని పిలుపును వ్యక్తిగత విషయంగా ఆమె పేర్కొన్నారు. ఆదివారం రాత్రి తొమ్మిది గంటలకు తనకు నిద్రొస్తే నిద్రపోతానని చెప్పారు. ఆయన మీకు చెప్పాడు.. మీరు చెయ్యండి. నన్నెందుకు దాని గురించి అడుగుతున్నారంటూ మీడియా ప్రతినిధులకు ఎదురు ప్రశ్న వేశారు నేనేం చేయగలనో నేను చెబుతా.. మోదీ ఏం చేయగలరో ఆయన బెబుతాడు. నేనెందుకు ఇతరుల విషయాల్లో తలదూర్చాలి. కరోనా వైరస్‌ను అడ్డుకో మంటారా లేదా రాజకీయాలు చేయమంటారా? దయచేసి రాజకీయ పోరుకు ఆజ్యం పోయకండి. నరేంద్రమోదీ చెప్పింది మంచిదనిపిస్తే మీరు చెయ్యండి. ఆ టైంలో నాకు నిద్రొస్తే నిద్రపోతా.. అది వ్యక్తిగత విషయమని అన్నారు. కాగా, కరోనా చీకట్లను తరిమికొట్టడానికి దేశమంతా ఒక్కటై సంకల్ప బలాన్ని ప్రదర్శించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 5 ఆదివారం రాత్రి 9 గంటలకు ఇళ్లలో లైట్లు అన్ని ఆర్పేసి దీపాలు, కొవ్వొత్తులు, టార్చిలైట్లు, మొబైల్‌లలో ఎ÷-లాష్ లైట్లు తొమ్మిది నిమిషాల సేపు వెలిగించాలని విజ్ఞప్తి చేశారు.

నిర్మల్‌లో ఆశా కార్యకర్తలపై దాడి

కౌన్సిలర్ నేతృత్వంలో మూకుమ్మడి దాడి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కార్యకర్తలు

నిర్మల్,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆశా కార్యకర్తలంతా ఆందోళనకు దిగారు. కరోనా కేసుల నేపథ్యంలో సర్వేకు వెళ్లిన వారిపై స్వయంగా ఓ కౌన్సిలరే దాడికి దిగడంతో వారంతా పారిపోయి వచ్చి వైద్యారోగ్య శాఖ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. శుక్రవారం ఆదిలాబాద్‌లో ఇలాంటి ఘటనే జరగగా, శనివారం నిర్మల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. వైఎస్సార్ కాలనీ, కబూతర్ కాలనీల్లో ఆశా కార్యకర్తలపై ముస్లిం కుటుంబాలు దాడికి పాల్పడ్డారు. వీరికి కౌన్సిలర్ తోడు కావడంతో పరిస్థితి చేయిదాటింది. దీంతో చేసేదేమీ లేక తప్పించుకున్న ఆశా కార్యకర్తలు కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. మమ్మల్ని కొట్టడానికి గుంపులు గుంపులుగా వచ్చారు..భద్రత లేకుండా విధులు నిర్వహించలేమని ఆశా కార్యకర్తలు మొరపెట్టుకున్నారు. తమకు రక్షణ కలిపించాలని కలెక్టర్‌ను కోరారు. ముస్లిం కుటుంబాలన్నీ గుంపులు... గుంపులుగా కొట్టడానికి వచ్చారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. హత్య చేస్తామంటూ బెదిరించారని.. భద్రత లేకుండా తాము విధులు నిర్వహించలేమని ఆశా కార్యకర్తలు తెలిపారు. మరోవైపు జిల్లాలో కఠినమైన ఆంక్షలు అమలు చేస్తున్నా.. ఇలాంటి ఘటన చోటు చేసుకోవడమంపై ఆందోళన వ్యక్తం చేశారు. కరోనాతో మృతి చెందిన వ్యక్తి నివాసం ఉండే జోహ్రానగర్ పై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆ ఇంటికి చుట్టూరా కిలోమీటర్ పరిధిలో ఉన్న కుటుంబాలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఢిల్లీకి వెళ్లి వచ్చిన 52 మందిలో 16మందికి ఐసోలేషన్‌లో చికిత్స చేస్తున్నారు. 55సంవత్సరాలు పైబడి దీర్ఘకాలిక వ్యాధులతో ఉన్న 10మందిని హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు.

నేటినుంచి తిరుమల శ్రీవారి వసంతోత్సవాలు

ఏకాంతంగా నిర్వహించనున్న టిటిడి

తిరుపతి,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక వసంతోత్సవాలను ఆదివారం నుంచి నిర్వహించనున్నారు. ఆది, సోమ, మంగళ వారాల్లో మూడు రోజులపాటు తిరుమల తిరుపతి దేవస్థానం ఈ ఉత్సవాలను నిర్వహించనుంది. అయితే కరోనా మహమ్మారి కారణంగా దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ కొనసాగుతున్న నేపథ్యంలో ఈసారి స్వామివారి వసంతోత్సవాలను ఏకాంతంగా నిర్వహించ నున్నట్లు టీటీడీ వెల్లడించింది. అదేవిధంగా ప్రతి ఏడాదిలా వసంత మండపలంలో కాకుండా కల్యాణోత్సవ మండపంలో శ్రీనివాసుడి వసంతోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించింది. పరిమిత సంక్యలో టిటిడి ఉద్యోగులు మాత్రమే పాల్గొంటారు.

ఆగని కరోనా ప్రకంపనలు

హైదరాబాద్,ఏప్రిల్ 4:కనిపించని కుంటున్నాయి. ఇది దారుణం కాక మరోటి శత్రువుతో ఇప్పుడు ప్రపంచమంతా యుద్ధం చేస్తోంది. విజృంభిస్తున్న కరోనాను విస్తరించకుండా అడ్డుకునే ప్రయత్నాలే జోరుగా సాగుతున్నాయి. నిద్రాహారాలు మాని దానిని మట్టు పెట్టేందుకు ప్రపంచంలో ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు దాని దుంపతెంచడానికి వివిధ దేశాలు పరిశోధనలు విస్తృతం చేశాయి. కరోనా వైరస్ కోసం ఆయా దేశాల శాస్త్రవేత్తలు నిరంతరం శ్రమిస్తున్నారు. ఇప్పటికిప్పుడు దీని నివారణకు మందులైతే లేవు. ఉన్న మందులతో వ్యాధిని అణచివేసే ప్రయత్నాలు మాత్రమే సాగుతున్నాయి. అందుకే అన్ని దేశాలు లాక్‌డౌన్‌తో ప్రజలను రక్షించుకునే యత్నాలు ముమ్మరం చేశాయి. ప్రజలను ఇళ్లకే పరిమితం చయడం ద్వారా వైరస్ వ్యాప్తిని నిరోధించే ప్రయత్నాలు సాగుతున్నాయి. అందుకే ప్రజలు కూడా తమకేమీ కాదులే అన్న పెడధోరణిని విడనాడి ఇళ్లకే పరిమితం కావాలి. హెచ్చరికలను పెడచెవిన పెట్టిన అమెరికా, ఇటలీ,స్పెయిన్ తదితర యూరోప్ దేశాలు భారీ మూల్యాన్ని చెల్లించుకుంటున్నాయి. కరోనా పాజిటివ్ ఉన్న వ్యక్తులు వైద్యుల సూచనల మేరకు నడుచుకోవాలి. వారు ఇతరులకు వైరస్ వ్యాప్తి చేయ కుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో కరోనా వైరస్ లక్షణాలు ఉన్నవారిని గుర్తించే ఇంటింటా సర్వే కార్యక్రమం సాగుతోంది. అయితే ఇలా బయలుదేరిన ఆశా కార్యకర్తలపై దాడులు చేస్తున్న ఘటనలు చోటుచేసు చవ్యాప్తంగా పెరుగుతున్న పాజిటివ్ కేసుల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. రాబోయే రోజుల్లో కేసులు మరిన్ని పెరిగే అవకాశం ఉందని వైద్య నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఇంక్యుబేషన్ సమయం దగ్గరపడు తుండటంతో వైరస్ బలపడుతోందని వైద్య నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈనేపథ్య లో ప్రజలు అప్రమత్తంగా లేకపోతే పెను ప్రమాదమేనని హెచ్చరిస్తున్నారు. భౌతిక దూరం నిబంధనను మరింత కఠినంగా పాటించాలని సూచిస్తున్నారు. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో భారత్‌లో 21రోజుల పాటు విధించిన లాక్‌డౌన్ ఎప్పుడు ఎత్తివేస్తారనే చర్చ ఇప్పుడు దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున సాగుతోంది. ఏప్రిల్ 15న లాక్‌డౌన్‌ను ఎత్తివేస్తారని ఊహాగానాలు వినిపిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన సంకేతాలు మాత్రం రావడంలేదు. లాక్‌డౌన్‌ను మరికొన్ని నెలల పాటు పొడిగిస్తారని సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం జరిగినా దానిని కేంద్రం కొట్టిపారేసింది. అయితే ప్రస్తుతం దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న కరోనా పాజిటివ్ కేసులు, మరోవైపు కోవిడ్ మృతుల సంఖ్య ప్రజల్లో భయాందోళనలను సృష్టిస్తోంది. ఈ క్రమంలో ఏప్రిల్ 15న లాక్‌డౌన్ ఎత్తివేసే సాహసం కేంద్ర ప్రభుత్వం చేస్తుందా..? అనేది కోట్లాది మందిని వెంటాడుతున్న ప్రశ్న. ఎందుకంటే సామాజిక దూరం పాటించాలన్న నిబంధనలను కొందరు ఉల్లంఘించి లాక్‌డౌన్‌ను అపహాస్యం చేస్తున్నారు. ఇలాంటి వారివల్లనే వైరస్ వ్యాప్తి సాగుతోంది. దేశంలో లాక్‌డౌన్‌ను మరికొంత కాలం కొనసాగించే అవకాశం లేకపోలేదు. అప్పటికీ పరిస్థితి మెరుగుపడకపోతే కఠిన నిబంధనలు అమలు చేసినా ఆశ్చర్య పోవాల్సిన పనిలేదు. ఎందుకంటే లాక్‌డౌన్‌ను ప్రకటించడం కన్నా.. దానిని ఎత్తివేయడం చాలా కష్టతరమైన విషయం. అత్యధిక జనాభా కలిగిన భారత్‌లో ఇది మరింత కఠినం. ప్రస్తుతం దేశంలో కరోనా కేసుల సంఖ్య పెద్ద ఎత్తున పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో ఎలాంటి ముందుజాగ్రత్తలు లేకుండా ఏప్రిల్ 15న లాక్‌డౌన్‌ను ఎత్తివేస్తారని అనుకోవడం లేదు. లాక్‌డౌన్‌ను ఎత్తివేసిన తరువాత వైరస్‌ను అదుపుచేయడం భారత్ వైద్యులకు అంత సులువైనది కాదు. వైరస్ వ్యాప్తి తగ్గకముందే లాక్‌డౌన్ ఎత్తివేస్తే ఇబ్బందులు తప్పవు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 14 తరవాత పరిస్థితి ఏంటన్నది దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దీనిపై పలువురు ప్రముఖులు వివిధ కోణాల్లో స్పందిస్తున్నారు. లాక్‌డౌన్‌ను పొడిస్తారని కొందరు అభిప్రాయ పడుతుండగా... ప్రాంతాలు, వైరస్ ప్రభావాన్ని బట్టి దీనిపై కేంద్రం నిర్ణయం తీసుకుంటుందని పలువురు విశ్లేషిస్తున్నారు. దేశంలో వైరస్ తొలిదశలో ఉన్న సమయంలోనే మార్చి 24న దేశ వ్యాప్తంగా లాక్‌డౌన్‌ను విధించిన విషయం తెలిసిందే. ప్రజల స్పందనను, వారు స్వీయనిర్బంధనను బట్టి, అలాగే వైరస్ వ్యాప్తి తీవ్రతను బట్టి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. దీనికి ప్రజలుగా మనమంతా కట్టుపడి ఉండాల్సిందే.

కరోనా పాజిటివ్ కేసుల్లో అగ్రభాగాన గ్రేటర్

నగర వాసులను భయపెడుతోన్న మహమ్మారి

నిజాముద్దీనిక్ వెళ్లివచ్చిన వారితో పెరిగిన కేసుల సంఖ్య

కమ్యూనిటీ పోలీసింగ్‌తో కరోనా ఫ్రీ సిటీగా చేసే యత్నాలు

హైదరాబాద్,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో నమోదైన కరోనా పాజిటివ్ కేసుల్లో అగ్రభాగాన గ్రేటర్ హైదరాబాద్ ఉంది. మరణాల్లో కూడా ఎక్కువ భాగం ఇక్కడివే ఉన్నాయి. ఖైరతాబాద్‌లో ఓ వృద్ధుడు మరణించాక పరీక్షలు నిర్వహించడంతో అది కరోనా అని తేలింది. ఇదే మొదటి కరోనా మృతిగా నమోదైంది. తర్వాత యూసుఫ్‌గూడ, న్యూమలక్‌పేట, దారుషిఫా చంచల్‌గూడ, కుత్బుల్లాపూర్‌కు చెందిన వారు కరోనాతో మరణించారు. తాజాగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఇద్దరు మరణించగా ఇందులో సికింద్రాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఉన్నాడు. ఒకే రోజు రికార్డు స్థాయిలో 27కు పెరిగింది. దీంతో నగరంలో కరోనా పాజిటివ్‌ల సంఖ్య 74కు చేరింది. మేడ్చల్,రంగారెడ్డి జిల్లాల పరిధిలో సుమారు 20 పాజిటివ్ కేసులు నమోదైనట్టు అధికారులు చెబుతున్నారు. తెలంగాణలో శుక్రవారం ఒక్క రోజే 75 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అందులో గ్రేటర్‌లోనే 60 శాతం కేసులు ఉండడం నగర వాసులను భయపెడుతోంది. బాధితుల్లో అత్యధికం మర్కజ్‌కు వెళ్లి వచ్చిన వారే కావడం గమనార్హం. మార్చి 28న నగరంలో తొలి కరోనా కేసు నమోదైంది. తర్వాత సంఖ్య నెమ్మదిగా పెరుగుతూ వచ్చింది. అనుకున్న స్థాయిలో వైరస్ లేదని వైద్య అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కానీ ఢిల్లీలోని నిజాముద్దీన్ ప్రార్థనకు వెళ్లొచ్చిన వారిలో కరోనా అధికంగా కనిపించడంతో అప్రమత్తవ ఎయ్యారు. నిజాముద్దీన్‌కు వెళ్లిన వారిని క్వారంటైన్ చేశారు.నిజామియా ఆస్పత్రిలో 213 మంది, సరోజినీ అస్పత్రిలో 39 మంది, నేచర్ క్యూర్ అస్పత్రిలో 210మందిని నిజాముద్దీన్ వెళ్లి వచ్చిన వారిని క్వారంటైన్ చేశారు. వీరిలో అనారోగ్యం బారినపడిన వారి రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించారు. వీటిల్లో కొన్ని ఫలితాలు శుక్రవారం వెల్లడయ్యాయి. ఫలితాలన్నీ ఒకేసారి రావడం వల్ల పాజిటివ్ కేసులు ఒకేరోజు పెరిగి ఉండొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. మరిన్ని ఫలితాలు రెండు రోజుల్లో రానున్నాయి. దీంతో ఎక్కువ కేసులు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. శుక్రవారం సుమారు 75 మంది నమూనాలు పరీక్షల నిమిత్తం పంపించారు. వీరిలో 24 మందికి పాజిటివ్ అని తేలింది. రాత్రిదాటిన తర్వాత మరో ముగ్గురికి కూడా పాజిటివ్ వచ్చినట్టు తెలిసింది. వీరందరినీ గాంధీ ఐసొలేషన్ వార్డుకు తరలించారు. వీరితో ఉన్న కుటుంబ సభ్యులు, సన్నిహితులు, స్నేహితులకు కూడా వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహిస్తున్నారు.కరోనా కట్టడిలో పోలీసులకు కమ్యూనిటీ పోలీసింగ్ ఎంతగానో సహకరిస్తున్నది. ఢిల్లీ నిజాముద్దీన్ ప్రార్థనలకు వెళ్లివచ్చిన వారిని గుర్తించడంలో పోలీసులకు కమ్యూనిటీ పోలీసింగ్ నుంచి సమాచారం వస్తున్నది. ఇప్పటికే హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఢిల్లీకి వెళ్లొచ్చిన వారందరినీ దాదాపుగా గుర్తించారు. ఇతర విభాగాల సమన్వయంతో ఢిల్లీ వెళ్లొచ్చిన వారి వివరాలు తీసుకొని, స్థానిక పోలీస్‌స్టేషన్ సిబ్బందికి కరోనా అనుమానితులను గుర్తించే బాధ్యతలను అప్పగించారు. దీంతో ఇప్పటికే నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న వారందరినీ గుర్తించి, వారి లింక్‌లను కూడా గుర్తించారు. కరోనా ఫ్రీ సిటీగా గుర్తించే పనిని విజయవంతం చేసేందుకు నగర పోలీసులు కృషి చేస్తున్నారు. ఇందులో కమ్యూనిటీ పోలీసింగ్ సేవలను ఉపయోగిస్తున్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ గ్రూప్‌లను తయారు చేసి ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సెక్టార్ల వారీగా ప్రజా సమస్యలను కూడా పరిష్కరిస్తున్నారు. దీంతో పోలీసులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలోనే దాదాపుగా హైదరాబాద్‌లో ఇతర దేశాలు, రాష్ట్రాలకు వెళ్లొచ్చిన వారందరినీ గుర్తించే పని పూర్తయ్యిందనుకున్న సమయంలోనే ఢిల్లీ నిజాముద్దీన్ ఘటన అందరినీ ఖంగుతిన్పించింది. ఈ విషయం వెలుగులోకి రావడంతోనే మొదట్లో ఆందోళనకు గురైనా.. ఒకటి రెండు రోజుల్లోనే పరిస్థితిని పోలీసులు చక్కబెట్టారు. ఇతర దేశాలు, రాష్ట్రాలకు వెళ్లొచ్చిన వారి వివరాలను సేకరించి... వారందరికీ పరీక్షలు నిర్వహించారు. కరోనా అనుమానితులను క్వారంటైన్ చేసి, పాజిటివ్ వచ్చిన వారిని ఆయా దవాఖానలకు తరలించారు. ఇంకా ఎవరైనా ఉంటే... వారి సమాచారాన్ని కమ్యూనిటీ పోలీసింగ్ సభ్యులు పోలీసులకు సమాచారం అందిస్తున్నారు. నగర పోలీస్ కమిషనర్‌తో పాటు డయల్ 100కు, స్థానిక పోలీసులకు ఈ సమాచారం వస్తుంది. దీంతో వెంటనే క్షేత్ర స్థాయిలోని పోలీసులు రంగంలోకి దిగి... అలాంటివారిపై నిఘా పెడుతున్నారు. ఇప్పటి వరకు గుర్తించిన వారితో పాటు వారెవరిని కలిశారనే విషయంలో స్పష్టత వస్తున్నా.. మరింత స్పష్టత కోసం పోలీసులు నిరంతరం పనిచేస్తున్నారు. దీనిలో కమ్యూనిటీ పోలీసింగ్ సేవలను పోలీసులు ఉపయోగించుకుంటున్నారు.

ఢిల్లీలో బిజెపి అధ్యక్షుడు నడ్డను కలిసిన జనసేనాని పవన్ కళ్యాణ్. చిత్రంలో ఎంపి జివిఎల్ , పురందేశ్వరి, నాదెండ్ల మనోహర్ ఉన్నారు.

మద్యం కోసం విపరీత ఆలోచనలు

కూల్‌డ్రింక్‌లో షేవింగ్ లోషన్ కలుపుకుని సేవనం

ఇద్దరి మృతి..మరో ఇద్దరి పరిస్థితి విషయం

చెన్నై,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ కారణంగా ఆయా రాష్ట్రాలు మద్యం షాపులను మూసేశాయి. దీంతో మందు బాబులు నరకం చూస్తున్నారు. మద్యానికి బానిసైన వారు వింతగా ప్రవర్తిస్తున్నారు. ఆ కిక్ కోసం ఏవేవో ప్రయత్నాలు చేసి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. తమిళనాడు పుదుకొట్టె జిల్లాలో దారుణం జరిగింది. కోటపట్టినంకు చెందిన నలుగురు యువకులు నిత్యం మద్యం సేవించేవారు. అయితే వారికి మద్యం ఎక్కడా దొరకడం లేదు. ఎవరో చెప్పిన మాటలు విని.. కూల్‌డ్రింక్‌లో షేవింగ్ లోషన్ కలుపుకొని ఆ నలుగురు సేవించారు. దీంతో ఇద్దరు యువకులు చనిపోగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఇద్దరికి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. ఇలాంటి ఘటననే నాలుగు రోజుల క్రితం కేరళలో చోటు చేసుకుంది. అక్కడ ఓ వ్యక్తి కూల్‌డ్రింక్‌లో షేవింగ్ లోషన్ కలుపుకొని సేవించడంతో అతను మరణించాడు. మద్యం షాపులు మూసివేయడంతో.. ఆల్కహాల్‌తో తయారు చేసిన ద్రవపదార్థాలను సేవించేందుకు మద్యం బాబులు ప్రయత్నిస్తున్నారు.

కోవిడ్-19 ప్రబలకుండా పకడ్బందీ చర్యలు : ముషారఫ్ ఫారూఖీ

నిర్మల్,ఏప్రిల్4: నిర్మల్ జిల్లాలో కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా, కోవిడ్-19 వ్యాధి ప్రబలకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ముషారఫ్ ఫారూఖీ తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్, కస్తూర్భాగాంధీ బాలికల గురుకుల పాఠశాల, సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన క్వారంటైన్ కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కరోనా వైరస్ వ్యాప్తిపై నేడు వైద్యశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ముషారఫ్ ఫారూఖీ మాట్లాడుతూ.. వైరస్ వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పాజిటివ్ కేసులు నమోదైతే అందుకు తగ్గట్లు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వసంతరావు, జిల్లా ఏరియా ఆస్పత్రి సూపరిటెండ్ డాక్టర్ దేవేందర్‌రెడ్డి, కరోనా నియంత్రణ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ కార్తీక్, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డా

మహారాష్ట్రలో పోలీసులకు మాస్కులు, శానిటైజర్లు

ముంబై,ఏప్రిల్ 4: కరోనా వ్యాప్తిని నివారించడం కోసం దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ కొనసాగుతున్నది. ఈ లాక్‌డౌన్ నిబంధనలను ఎవరూ ఉల్లంఘించకుండా చూడటంలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారు. అంతేగాక నిత్యం రోడ్లపై ఉండి విధులు నిర్వహించే వీరు ఒక రకంగా కరోనాకు ఎదురు వెళ్లి పోరాటం చేస్తున్నట్టే. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వం వారిని కరోనా మహమ్మారి బారిన పడకుండా చూడటం కోసం రక్షణ సామాగ్రిని అందజేసింది. మహారాష్ట్ర హోంమంత్రి అనిల్ దేశ్‌ముఖ్ స్వయంగా పోలీసులకు మాస్కులు, శానిటైజర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన అనిల్ దేశ్‌ముఖ్.. కరోనా విస్తరిస్తున్న సమయంలో బాధ్యతగా విధులు నిర్వహిస్తున్న పోలీసులను మనం కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

పిఎం కేర్‌కు బండి సంజయ్ విరాళం

స్పందించి విరాళం ఇచ్చి వారిని అభినందించిన బండి

కరీంనగర్,ఏప్రిల్4(నేటినిజం ప్రతినిది): పీఎం కేర్స్ సహాయ నిధికి తన ఎంపీ ల్యాండ్స్ నుండి 1 కోటి రూపాయలు, ఒక నెల జీతం లక్ష రూపాయలను కరీంనగర్ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన బండి సంజయ్.. తన పిలుపునకు స్పందించి శుక్రవారం ఉదయం 11 గంటల నుండి 1 గంట సమయంలో తెలంగాణ బీజేపీ కార్యకర్తలు భారీగా ప్రధాని సహాయ నిధికి విరాళాలు అందించారన్నారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపుకు తెలంగాణ ప్రజలు ఏ ప్రాంతంలో ఉన్న, ఏ దేశంలో ఉన్న ముందుకు వచ్చి విరాళాలు పంపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కరోనా మహమ్మరిని తరిమేద్దాం దేశాన్ని గెలిపిద్దామన్న ఆయన..2 గంటల వ్యవధిలోనే ఇంత పెద్ద ఎత్తున దేశంకోసం ముందుకు వచ్చి ప్రధాని సహాయ నిధికి విరాళాలు అందించిన బీజేపీ కార్యకర్తలకు, అభిమానులకు కృతజ్ఞతలు అన్నారు. ఇప్పటికే కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో తన ఎంపీ ల్యాండ్స్ నుండి 50 లక్షలను కరోనా వైరస్ నివారణకు వినియోగించడానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఇచ్చారు. కోవిడ్-19 పేరుతో సింగరేణి కార్మికుల జీతంలో కోత విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైంది కాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ పేర్కొన్నారు. ఇకపోతే గాంధీ ఆస్పత్రిలో వైద్యులపై దాడి జరిగిన ఘటనను మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఖండించకపోవడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ విమర్శించారు. మైనారిటీ ఓట్లతో పబ్బం గడిపే ఒవైసీ, కరోనా నివారణకు పిలుపునివ్వకపోవడం శోచనీయమని విమర్శించారు. ఒవైసీ ఆస్పత్రిని ఐసోలేషన్ వార్డుగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గాంధీ ఆస్పత్రిలో వైద్యులపై, నిజామాబాద్‌లో సిబ్బందిపై జరిగిన దాడిని బీజేపీ నేత కె.లక్ష్మణ్ ఖండించారు. క్లిష్ట సమయంలో వైద్యులకు అన్ని విధాలా అందరూ సహకరించాలని బీజేపీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు విజ్ఞప్తి చేశారు. 'మర్కజ్' వెనుక కుట్ర కోణంపైనా విచారణ అవసరమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేశ్‌రెడ్డి చెప్పారు.

సింగరేణిలో లాక్‌డౌన్ ప్రకటించాలి

గోదావరిఖని,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): సింగరేణిలో లే ఆఫ్‌కు బదులు లాక్ డౌన్ ప్రకటించాలని, అదే విధంగా కార్మికులకు పూర్తి వేతనం చెల్లించాలని జాతీయ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ నెల 14లోగా సమస్యలను పరిష్కరించని పక్షంలో 15 నుంచి సమ్మెకు దిగుతామని హెచ్చరించాయి. ఈ మేరకు సింగరేణి సీఎండీకి సమ్మె నోటీస్ ఇచ్చినట్లు ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, హెచ్ఎంఎస్, సీఐటీయూ ప్రకటించాయి. కోల్ ఇండియాలో డీజీఎంఎస్ ఇచ్చిన నోటీసుతో అక్కడి గనుల్లో లాక్ డౌన్ ప్రకటిస్తే, సింగరేణి యాజమాన్యం మాత్రం 22 అండర్ గ్రౌండ్ గనుల్లో సగం జీతంతో కూడిన లే ఆఫ్ ప్రకటించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశం ప్రకారం లాక్ డౌన్ చేయాలె తప్ప లే ఆఫ్ ఇవ్వకూడదన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వేతనాల కోతకు సింగరేణికి ఎలాంటి సంబంధం లేదని, కార్మికులకు జీతాలు రాష్ట్రం ఇవ్వదని స్పష్టం చేశారు. కంపెనీనే జీతాలు చెల్లిస్తుందని, పేమెంట్ ఆఫ్ వేజెస్ యాక్ట్ ప్రకారం కోత చెల్లదని పేర్కొన్నారు. ఇక కోల్ ఇండియా కార్మికుల అనుమతి తీసుకొని పీఎంఆర్ఎఫ్?కు కార్మికుల ఒక్కరోజు వేతనాన్ని విరాళంగా ఇచ్చిందని చెప్పారు. కానీ సింగరేణి యాజమాన్యం మాత్రం కార్మికులను సంప్రదించకుండానే ఒక్క రోజు జీతం మొత్తం రూ.7.50 కోట్లను సీఎంఆర్ఎఫ్?ఇచ్చిందన్నారు. కార్మికుల వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాలను వెంటనే ఉపసంహరించు కోవాలని కోరారు. ఇప్పటికైనా టీబీజీకేఎస్ కార్మికుల పక్షాన నిలబడి పోరాడాలని సూచించారు. సమావేశంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు వై.గట్టయ్య, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ బి.జనక్ ప్రసాద్, బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కెంగెర్ల మల్లయ్య, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, సీఐటీయూ అధ్యక్షుడు టి.రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగోల్ రైతు బజార్‌ను సందర్శించిన మేయర్

సామాజిక దూరం పాటించాలన్న రామ్మోహన్

హైదరాబాద్,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): నగరంలోని నాగోల్‌లో గల అనంతుల రాంరెడ్డి ఫంక్షన్ హాలులో నూతనంగా రైతు బజార్‌ను ఏర్పాటు చేశారు. ఈ రైతు బజార్‌ను మేయర్ బొంతు రామ్మోహన్ శనివారం పరిశీలించారు. సామాజిక దూరం పాటించి అమ్మకం, కొనుగోలు చేయాల్సిందిగా దుకాణాదారులకు, వినియోగదారులకు మేయర్ సూచించారు. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో జీహెచ్ఎంసీ మొబైల్ కూరగాయల, పండ్ల మార్కెట్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. అంతేకాకుండా ప్రజలందరూ ఒకే దగ్గంతకు చేరకుండా ఉండేందుకు విశాల ప్రదేశాల్లో కూరగాయల మార్కెట్లను ఏర్పాటు చేస్తుంది. నగరవ్యాప్తంగా పరిశుభ్రత పాటించడంతో పాటు, ఎప్పటికప్పుడూ శానిటైజేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తోంది.లాక్‌డౌన్ నేపథ్యంలో పేదలు,కూలీలను ఆదుకునేందుకు ప్రభుత్వంతోపాటు వివిధ స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఆహార ప్యాకెట్లు, బియ్యం పంపిణీ చేస్తున్నారని, వారి ఉద్దేశం మంచిదే అయినప్పటికీ పంపిణీ సందర్భంగా ప్రజలు గుమిగూడడంవల్ల లాక్‌డౌన్ ఉద్దేశం నీరుగారే అవకాశం ఉందని మేయర్ చెప్పారు. పది మొబైల్ వాహనాల ద్వారా దాతలనుంచి ఆహార పదార్థాలు, బియ్యాన్ని సేకరించి జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలోనే వాటిని పంపిణీచేస్తామని చెప్పారు. ఎవరికి వారే పంపిణీ చేయడంవల్ల ప్రజలు సోషల్ డిస్టెన్స్ పాటించకుండా గుమిగూడుతున్నారని పేర్కొన్నారు.

450 బృందాల ద్వారా ఇంటింటి సర్వే

-స్వయంగా పరిశీలించిన కలెక్టర్, కమిషనర్

వరంగల్,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): కరోనా వ్యాప్తి కట్టడికి వరంగల్ అర్బన్ జిల్లాలో విస్తృత చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ రాజీవ్ హన్మంతు తెలిపారు. శుక్రవారం నగరంలోని రంగంపేట, చార్ బౌలీలో జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ రవీందర్, జీడబ్ల్యూఎంసి కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కలెక్టర్..వరంగల్ అర్బన్ జిల్లాలో 450 సర్వే బృందాల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని..15 ప్రాంతాల్లో45 వేల గృహాలలో ఇంటింటి సర్వే చేస్తున్నారని తెలిపారు. ఎంజీఎం ఇసోలేషన్ ఉన్నవారిని గాంధీకి తరలిస్తున్నామని..కేయు, హరిత కాకతీయ అనంత లక్ష్మి కే ఏంసి పున్నమి రీజనల్ కంటి దవాఖానలో క్వారెంటేయిన్ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పిన కలెక్టర్..మరిన్ని క్వారెంటేయిన్ ల గుర్తింపు కు ఆదేశాలిచ్చామన్నారు. అలాగే.. 4 ÷5 వాహనాల ద్వారా హైపో క్లోరైట్ పిచికారి మరో రెండు వాహనాల ద్వారా పిచికారి చేస్తున్నామని తెలిపారు కమిషనర్. లాక్ డౌన్ పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని.. ఇప్పటి వరకు లాక్ డౌన్ ఉల్లంఘించిన వారిపై వెయ్యికి పైగా కేసులు నమోదు చేశామని సీపీ రవీందర్ తెలిపారు. ఫేక్ న్యూస్, వదంతులు అసత్య ప్రచారం.. ఇతరులపై దుష్ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అతలాకుతలం అవుతున్న అమెరికా ఆర్థికవ్యవస్థ

అయినా షెడ్యూల్ ప్రకారమే ఎన్నకలంటున్న ట్రంప్

ప్రస్తుత పరిస్థితులతో ఆందోళనలో ప్రజలు

వాషింగ్టన్,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): అమెరికాలో కరోనా విజృంభిస్తోంది. రోజూ మరణాల సంఖ్య పెరుగుతోంది. ప్రజల నిర్లక్ష్యంతో పాటు, ప్రభుత్వ నిర్లిప్తత కారణంగా కరోనా వేలాదిమందిని బలి తీసుకుంది. ఇకపోతే అక్కడ కఠిన చర్యలను అలము చేయడం లేదు. పూర్తిస్థాయిలో లాక్‌డౌన్ అమలు జరగడం లేదు.

దీంతో కరోనా విజృంభిస్తోంది. దీనిపై పలు రాష్ట్రాల గవర్నర్లు కూడా అధ్యక్షుడు ట్రంప్ తీరును తప్పు పడుతున్నారు. అయితే ట్రంప్ మాత్రం 2లక్షల మంది వరకు మరణించక తప్పదని నింపాదిగా చెబుతున్నారు. ఆయనకు అధ్యక్ష ఎన్నికలపైనే అమిత ప్రేమ కనిపిస్తోంది. ఈ ఏడాది అమెరికాలో దేశాధ్యక్ష ఎన్నికలు జరగాల్సి ఉన్నది. అయితే ఆ ఎన్నికలు యథావిధిగా నవంబర్ 3వ తేదీనే జరుగుతాయని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన వైట్‌హౌజ్‌లో మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని చెప్పినట్లు తెలుస్తోంది. జనరల్ ఎలక్షన్స్ నవంబర్ 3వ తేదీనే జరుగుతాయని ట్రంప్ అన్నారు. కరోనా వైరస్ నేపథ్యంలో ఓటర్లు పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేయడం కొంత ఆందోళన కలిగించే విషయమే. కానీ, ఈ-మెయిల్ ద్వారా ఓటింగ్ వేసే పక్రియను ట్రంప్ వ్యతిరేకించారు. ఈమెయిల్ ఓటింగ్ వల్ల అవకతవకలు జరిగే ప్రమాదం ఉందని ట్రంప్ అన్నారు. ఈమెయిల్ ఓటింగ్‌తో చాలా మంది మోసం చేస్తారన్నారు. బూత్‌కు వెళ్లి గర్వంగా ఓటెయ్యాలన్నారు. ఓటరు ఐడీతోనే ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. మరోవైపు డెమోక్రటిక్ అభ్యర్థిగా రేసులో దూసుకువెళ్తున్న మాజీ ఉపాధ్యక్షుడు జోసెఫ్ బైడెన్ మాత్రం ప్రజలను ఈమెయిల్ ఓటింగ్‌కు సిద్ధం కావాలంటూ సూచిస్తున్నారు. కరోనా మహమ్మారి నేపథ్యంలో ఈమెయిల్ ఓటింగ్‌కు అవకాశాలు ఉన్నట్లు బైడెన్ తెలిపారు. అమెరికాలోని అనేక రాష్ట్రాలు కోవిడ్19 మహమ్మారి వల్ల ప్రైమరీ ఎన్నికలను వాయిదా వేశాయి. అయితే ఇప్పటికీ ఆస్పత్రుల్లో చావు బతుకుల్లో ఉన్న వారికి ఊపిరినిచ్చేందుకు వెంటిలేటర్లు లేని పరిస్థితి అమెరికాలో తలెత్తింది. కరోనా తీవ్రత నేపథ్యంలో వెంటిలేటర్లకు తీవ్ర కొరత ఏర్పడింది. అన్ని రాష్ట్రాలకు 2వేల మిలిటరీ వెంటిలేటర్లను పంపిస్తామని 'పెంటగాన్' రెండు వారాల కిందట ప్రకటించింది. ఇప్పటికి... వెయ్యి కూడా సరఫరా చేయలేకపోయింది. దేశవ్యాప్తంగా 9వేల వెంటిలేటర్లు కావాల్సి ఉందని అంచనా. కరోనాతో రాబోయే మరణాలను ఎదుర్కొనేందుకు ట్రంప్ సర్కారు సిద్ధమవుతోంది. యుద్ధాలు, దూర ప్రాంతాల్లో సైనికులు మరణించినప్పుడు... వారి మృతదేహాలను తరలించే బాడీ బ్యాగ్ పౌరులకు ఉపయోగించాలని నిర్ణయించింది. లక్ష బాడీ బ్యాగులను కొనుగోలు చేస్తున్నట్లు 'బ్లూమ్‌బర్గ్' వార్తా సంస్థ తెలిపింది. నాలుగు వారాలు ఇంటి నుంచి బయటికి రావొద్దు. ప్రతి ఒక్కరూ భౌతిక దూరం పాటించండని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపునిచ్చారు. కరోనా దెబ్బకు అమెరికా ఆర్థికవ్యవస్థ అతలాకుతలం అవుతోంది. అమెరికాలో దాదాపు 90 శాతం మంది ఇళ్లకే పరిమితమయ్యారు. పరిశ్రమలు, కార్యాలయాలు, స్టోర్లు, రెస్టారెంట్లు, ఇతర వాణిజ్య కార్యకలాపాలన్నీ 'కోజ్'! రెండు వారాల్లో కోటి మంది అమెరికన్లు తమ ఉద్యోగాలను కోల్పోయారు. ఈ దశలో ఎన్నికల గురించి మాట్లాడడం ఎంతవరకు సమంజసమన్న విమర్శలు వస్తున్నాయి.

ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో పెరుగుతున్న కేసులు

నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాలలో ఒక్కొక్కరికి కరోనా పాజిటివ్

15కు చేరిన కేసులు..రరెడ్ జోన్లుగా బాధితుల ప్రాంతాలు

ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): ఉమ్మడి పాలమూరు జిల్లాలో లాక్‌డౌన్ కఠినంగా అమలు చేస్తున్నారు. అలాగే ప్రజలు ఎవరు కూడా రోడ్లమీదకు రాకుండా పోలీసులు నిరంతరంగా కాపలా కాస్తున్నారు. మంత్రి శ్రీనివాసరెడ్డి అధికారులతో సమీక్షిస్తూ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. ఢిల్లీలోని మర్కజ్ వెళ్లి వచ్చిన వారిలో ముగ్గురికి, వారితో సన్నిహితంగా ఉన్న మరో ఇద్దరికి కరోనా పాజిటివ్ ఉన్నట్టు నిర్ధారణ కావడంతో ఉమ్మడి పాలమూరు జిల్లా ఉలిక్కిపడింది. ఆయా జిల్లాల్లో కరోనా పాజిటివ్ కేసులు రోజు రోజుకూ పెరుగుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వైరస్ విస్తరించకుండా కట్టుదిట్టంగా వ్యవహరిస్తూ, ప్రజలను మరింత అవగాహన కల్పిస్తున్నారు. కరోనా పాజిటివ్ నిర్ధారణ అయిన వ్యక్తుల కుటుంబ సభ్యులు, సన్నిహితంగా ఉన్నవారి నుంచి ఇతరులకు వ్యాప్తి చెందకుండా వారిని క్వారంటైన్‌లో ఉండేలా కట్టడి చేస్తున్నారు. రెవెన్యూ, పోలీసు,మున్సిపాలిటీ శాఖల అధికారులతో సమన్వయం చేసు కుంటూ వైద్యారోగ్యశాఖ అధికారులు పాజిటివ్ తేలిన వ్యక్తులతో కలిసి తిరిగిన వారిని యుద్ధప్రాతిపదికన గుర్తించే కార్యచరణ ప్రారంభించింది. మహబూబ్‌నగర్‌లో రెండు, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాలలో ఒక్కొక్కటి పాజిటివ్ కేసు నమోదు కావడంతో వీటి సంఖ్య 15కు చేరింది. దీంట్లో ఓ మరణం కూడా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఇంతవరకు మహబూబ్‌నగర్‌లో నమోదైన ఏడు పాజిటివ్ కేసులలో మూడు ఎయిర్‌పోర్ట్‌లో విధులు నిర్వహించిన ఇద్దరు ఉద్యోగులు కాగా, మరో వ్యక్తి వారి కుటుంబ సభ్యురాలికి వచ్చింది. మిగతా నాలుగు కేసులు ఢిల్లీలోని మర్కజ్‌కు వెళ్లి వచ్చిన ఇద్దరికి పాజిటివ్ ఉండటం వల్ల స్థానికంగా మరో ఇద్దరికి సోకింది. ఇంతవరకు పాజిటివ్ వచ్చిన వారిలో ఐదుగురు మహబూబ్‌నగర్ చెందిన వారు, మరో ఇద్దరు జడ్చర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన వారు ఉండటం గమనార్హం. నాగర్‌కర్నూల్ జిల్లాలో నమోదైన రెండు పాజిటివ్ కేసులు సైతం మర్కజ్‌కు వెళ్లి వచ్చిన వారివే. అలాగే జోగులాంబ గద్వాల జిల్లాలో నమోదైన ఆరు పాజిటివ్ కేసుల్లో మర్కజ్‌కు వెళ్లివచ్చిన వారే ఉన్నారు. పాలమూరు పట్టణానికి చెందిన బాధితుల్లో ఐదుగురు 45ఏళ్లకు పైబడిన వారు ఉండటం. వీరంతా గత నెల నుంచి ఎక్కడెక్కడ ఎవరెవరిని కలిశారనేది పోలీసులు, అధికార యంత్రాంగం రాబడుతోంది. వీరు సంచరించిన ప్రాంతాలు, కలిసిన వ్యక్తులు ఇప్పటికే 92మందిని అనుమానితులుగా గుర్తించి వీరందరినీ పాలమూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల క్వారంటైన్‌కు పంపించారు. వీరు నివాసముంటున్న పరిసర ప్రాంతాలను రెడ్‌జోన్లుగా గుర్తించి అక్కడి వారు ఎవరూ ఇళ్లలోంచి బయటకు రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శుక్రవారం 42మందికి సంబంధించి గొంతు, ముక్కుకు సంబంధించిన శాంపిళ్లను వైద్యాధికారులు హైదరాబాద్‌కు పంపించారు. దీంట్లో మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల జిల్లాల నుంచి 21మంది చొప్పున శాంపిళ్లు సేకరించి పంపారు. గద్వాలలో 30మంది, నారాయణపేటలో 11మంది, నాగర్‌కరూల్‌లో ఐదుగురు, వనపర్తిలో ఇద్దరు, మహబూబ్‌నగర్‌లో ఒకరు ఐసోలేషన్ వార్డుల్లో చికిత్స పొందుతున్నారు.

ప్రజలంతా స్వీయ నియంత్రణ పాటించాలి

సామాజిక దూరం పాటించడంతోనే కట్టడి

మంత్రి శ్రీనివాసగౌడ్ సూచన

బ్లీచింగ్ చల్లుతూ, హైపోక్లోరైడ్ ద్రావణంతో క్లీనింగ్

మహబూబ్‌నగర్,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): ప్రజలంతా స్వీయ నియంత్రణ పాటించాలని, భౌతిక దూరం, నిరంతరం చేతులను శుభ్రపరచుకుంటూ ఉండాలని మంత్రి శ్రీనివాస్ గౌడ్ చెబుతున్నారు. సామాజిక దూరం పాటించడంతో వైరస్‌ను అరిక ట్టవచ్చన్నారు. మర్కజ్ వెళ్లి వచ్చినవారు తమ వివరాలు తెలిపాలన్నారు. అప్పుడే వైరస్ వ్యాప్తి కాకుండా చర్యలు తీసుకోగలమని అన్నారు. మరోవైపు పారిశుధ్య కార్మికులు అన్ని ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లుతూ, హైపోక్లోరైడ్ ద్రావణంతో గృహాలను శుభ్రం చేస్తూ అగ్నిమాపక శాఖ సిబ్బంది ద్రావణం పిచికారీ చేస్తున్నారు. సోడియం హైపోక్లోరైడ్‌ను తుంపరలా ఆయా కాలనీ వీధుల్లో చల్లుతున్నారు. నిత్యావసర సరకుల పంపిణీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పాజిటివ్ నివేదికలు వచ్చిన వ్యక్తులున్న ప్రాంతాల్లోని వారు బయటకు రావొద్దని వీరికి కావాల్సిన నిత్యావసర సరుకులను మున్సిపాలిటీ సిబ్బందే ఇంటింటికీ తిరిగి పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటారని అధికార యంత్రాంగం వెల్లడించింది. మర్కజ్‌కు వెళ్లొచ్చిన 127 మంది.. ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజ్‌లో అధ్యాత్మిక సభలకు హాజరైన జిల్లా వాసుల లెక్క తేలింది. వీరిలో అందు బాటులో ఉన్న వారిని క్వారంటైన్ కేంద్రాలు, ఐసోలేషన్ వార్డులకు తరలించారు. ఇక ఇప్పుడే అధికారులకు అసలైన సవాలు ఎదురవుతోంది. మార్చి మూడో వారంలో వీరంతా ఢిల్లీ నుంచి తమ స్వస్థలాలకు చేరుకున్నారు. ఇళ్లకెళ్లాక ఎవరెవరిని కళా శారు, ఎక్కడెక్కడ తిరిగారు, ఏయే కార్య క్రమాల్లో పాల్గొన్నారు.. వారితో సన్నిహి తంగా ఉండే కుటుంబసభ్యులు, బంధువులు, మిత్రులు ఎవరెవరు.. వారి ఆరోగ్య పరిస్థితులు ఎలా ఉన్నాయనేది కూపీ లాగుతున్నారు. మర్కజ్ నుంచి తిరిగి వచ్చిన మహబూబ్‌నగర్ ప్రాంతానికి చెందిన కొందరికి సొంత దుకాణాలున్నాయి. ఈ క్రమంలో స్థానికులతో కలిసినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లాక్‌డౌన్‌కు ముందు వారి దుకాణాలకు ఎవరెవరు వచ్చారనే అంశంపైనా ఆరా తీస్తున్నారు. జిల్లా నుంచి తొలుత 95మంది మర్కజ్ నుంచి వచ్చిన వారు అని చెప్పిన ఆ తర్వాత ఆ సంఖ్య 127కు చేరింది. ఢిల్లీ వెళ్లివచ్చిన తర్వాత ఒక్కొ టక్కరు అయిదు గురు వ్యక్తులను పరిగణలో తీసుకున్నా.. కనీసం 635 మందిని కలిసే అవకాశం ఉందని అధికార యంత్రాంగం అంచనా వేసింది. ప్రధానంగా నేరుగా ప్రజలతో సత్సంబంధాలు కలిగిన వృత్తుల్లో ఉన్నవాళ్లు ఎక్కువ మందిని కలిసి ఉండే అవకాశం ఉందని అధికారులు ఆరా తీయడం ప్రాధాన్యతాంశంగా మారింది. ఒకవైపు ఎవరిని కలిశారనే వివరాలను సేకరించే పనిలో నిమగ్నమైన అధికారులు.. మరోవైపు మత ప్రార్థనలకు వెళ్లివచ్చిన కుటుంబ సభ్యులందరినీ ఇళ్లు దాటి బయటకు రావద్దని స్పష్టం చేశారు. స్వీయ గృహ నిర్బంధం పాటించేలా నిఘాను సైతం పెంచారు.

ఎపిలో వేగంగా ఇంటింటి సర్వే

కరోనా లక్షణాలున్న వారిని గుర్తించే చర్య

అధికారులకు సిఎస్ స్పష్టమైన ఆదేశాలు

అమరావతి,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ వ్యాప్తి నియంత్రణకు వైరస్ లక్షణాలు ఉన్న వారిని గుర్తించేందుకు ఇంటింటా సర్వే పక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వ ఎపి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్నీ అధికారులను ఆదేశించారు. కరోనా వైరస్‌పై సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి ఆమె వీడియో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ కంటైన్మెంట్ జోన్ లో ఉన్న వారిలో ఎవరైనా హైరిస్క్‌లో ఉంటే అలాంటి వారిని వెంటనే వైద్య పరీక్షలకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.పట్టణ ప్రాంతాల్లో సర్వే లెన్స్ వేగవంతంగా నిర్వహించాలని చెప్పారు. మూడు రోజుల్లో సర్వే పక్రియను పూర్తి చేయాలని సిఎస్ ఆదేశించారు. విలేజ్,వార్డు వాలంటీర్లు రేషన్ సరుకులు,పించన్లు పంపిణీలో నిమగ్నమై ఉన్నందున సబ్ సెంటర్ స్థాయిలోని ఎఎన్ఎంలు సర్వే పక్రియలో చురుకుగా వ్యవహరించాలని ఆదేశించారు. హైరిస్క్ ఉన్న వ్యక్తులు లేదా 65ఏళ్ళు పైబడి ఉన్న వారికి పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 50ఏళ్ళలోపు గల వారు 14రోజులపాటు హోం ఐసోలేషన్ లో ఉండేలా చూడాలని చెప్పారు.క్వారెంటైన్ కేంద్రాలలో ఉంచిన వారికి ప్రత్యేక గదులు, బాత్ రూం లు ఏర్పాటు చేయాలని ఇందుకు సంబంధించిన ప్రోటోకాల్ ను సక్రమంగా పాటించాలని సిఎస్ నీలం సాహ్నీ జిల్లా కలెక్టర్లకు స్పష్టం చేశారు.అంతేగాక ఈకేంద్రాలలో ఉంచిన వారికి డోస్పోజబుల్ ప్లేట్లో భోజనం అందించాలని స్పష్టం.అదేవిధంగా ప్రతి క్వారంటైన్ కేంద్రం వద్ద ఒక వైద్య బృందాన్ని అందుబాటులో ఉంచాలని అన్నారు.అంతేగాక ఆ వైద్య బృందం అక్కడ ఉన్న ప్రతి వ్యక్తి కేస్ షీటును నిర్వహించాలని సిఎస్ నీలం సాహ్నీ జిల్లా కలెక్టర్లకు స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డా.కెఎన్.జవహర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటి వరకూ 1157 శాంపిల్ పరీక్షలు నిర్వహించగా 108 పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయని చెప్పారు. క్వారెంటైన్ కేంద్రాలుగా పెద్ద పెద్ద క్యాంపస్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. అక్కడ ప్రతి ఒక్కరికీ తగిన వసతులు కల్పించాలని చెప్పారు. కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కె.భాస్కర్ మాట్లాడుతూ క్వారంటైన్ కేంద్రాలలో వసతులు కల్పనకు జిల్లా మినరల్ నిధులను వినియోగించుకోవాలని చెప్పారు.ప్రతి కేంద్రంలో 24గంటలూ విద్యుత్ సరఫరా ఉండేలా చూడాటలని,రోజుకు రెండు సార్లు బాత్ రూంలను శుభ్రం చేయాలని చెప్పారు. ఈకేంద్రాల్లో చేపట్టాల్సిన చర్యలుకు సంబంధించిన స్టాండర్డ్ ఆపరేటివ్ ప్రోసీజర్‌కి సంబంధించిన ఆదేశాలను జారీ చేయనున్నట్లు తెలిపారు. ముఖ్య కార్యదర్శి కృష్ణ బాబు మాట్లాడుతూ ఆన్ని రైతు బజారులు, నిత్యావసర వస్తువులు విక్రయించే దుకాణాలు వద్ద పెద్దసైజు బోర్డులను ఏర్పాటు చేసి ధరల పట్టికను ప్రదర్శించాలని చెప్పారు.భౌతిక దూరాన్ని పాటించేందుకు వీలుగా అవకాశం ఉన్న అన్ని చోట్ల పెయింటింగ్ వేయించాలని అవకాశం లేనిచోట్ల మట్టితో మార్కు చేయాలని సూచించారు. వీడియో సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్ చంద్ర,రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి ఉషారాణి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ గిరిజా శంకర్, మున్సిపల్ శాఖ కమిషనర్ జిఎస్ఆర్కె విజయకుమార్, పరిశ్రమల శాఖ సంచాలకులు సుబ్రహ్మణ్యం, సిఆర్డిఏ అదనపు కమిషనర్ విజయకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

కరోనా కట్టడిపై బీహార్ సీఎం సమీక్ష

పట్నా: కరోనా కట్టడి కోసం బీహార్ తగిన చర్యలు చేపడుతున్నది. బీహార్ సీఎం నితీశ్ కుమార్ ఎప్పటికప్పుడు మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ చేపట్టాల్సిన చర్యలపై చర్చిస్తున్నారు. తాజాగా శనివారం మధ్యాహ్నం కూడా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, పోలీస్ ఉన్నతాధికారులు, స్పెషలిస్ట్ డాక్టర్లతో బీహార్ సీఎం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతం కరోనా పరిస్థితి, పాజిటివ్ కేసులు, నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై చర్చించారు. కాగా, బీహార్‌లో ఇప్పటివరకు 31 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

అందరికి ఉచిత బియ్యం అందిస్తాం

సర్వర్ లోపం వల్

లైట్లు ఆర్పేస్తే గ్రిడ్ వైఫల్యం చెందుతుంది

అత్యవసర సేవలకు అంతరాయం ఏర్పడుతుంది
విద్యుత్ శాఖ మంత్రి డాక్టర్ నితిన్ రావత్ విమర్శలు

ముంబై,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తాజా పిలుపుపై స్వపక్షాలనుంచి హర్షంతో పాటు, కాంగ్రెస్ నేత శశిథరూర్ లాంటి విపక్షనేతలనుంచి, విద్యుత్తు ఇంజనీర్లు, నిపుణుల నుంచి కూడా విమర్శలు చెలరేగుతున్నాయి. తాజాగా మహారాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి డాక్టర్ నితిన్ రావత్ ఈ పిలుపుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం రాత్రి 9 గంటలకు నిమిషాలు లైట్లు ఆపివేయాలన్న సూచనపై పునరాలోచన చేయాలని లేదంటే అత్యసర సేవలకు విఘాతం ఏర్పడే అవకాశం వుందని ప్రజలను కోరారు. ఒకేసారి అన్ని లైట్లను స్విచ్ ఆఫ్ చేసే ముందు మనం పునరాలోచించాలనీ, ఇది గ్రిడ్ వైఫల్యానికి దారితీస్తుందని పేర్కొన్నారు. గ్రిడ్ వైఫల్యం చెందితే అత్యవసర సేవలను ప్రభావితం చేస్తుందని చెప్పారు. లాక్ డౌన్ కారణంగా, ఫ్యాక్టరీ యూనిట్లు లేనందున డిమాండ్ ఇప్పటికే 23,000 మెగావాట్ల నుండి 13,000 మెగావాట్లకు తగ్గింది... ఇక ప్రజలందరూ ఒకేసారి లైట్లను ఆపివేస్తే సరఫరాలో అంతరాయం కారణంగా లోడ్ అకస్మాత్తుగా పడిపోవడంతో విద్యుత్తు గ్రిడ్ కుప్పకూలిపోవచ్చని రావత్ చెప్పారు. అంతేకాదు తిరిగిసేవలను పునరుద్ధరించడానికి 12 నుంచి 16 గంటలు పడుతుందన్నారు. ప్రస్తుత సంక్షోభంలో విద్యుత్తు చాలా ముఖ్యమైన అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని లైట్లను ఆపి వేయవద్దంటూ పౌరులను రాష్ట్ర మంత్రి కోరారు. అటు మోదీ పిలుపుపై స్పందించిన మహారాష్ట్ర గృహనిర్మాణ మంత్రి జితేంద్ర ఇదొక మూర్ఖత్వపు సూచన, పిల్లతనం తప్ప మరొకటి కాదని అవద్ విమర్శలు గుప్పించారు. శశిథరూర్ సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రధానికి భవిష్యత్తుపైనగానీ, లాక్ డౌన్ తరువాత పరిస్థితులను ఎలా అంచనా వేయాలో తెలియదని, ఈ విషయంలో మోదీకి ఒక 'విజన్' అంటూ లేదని ఆయన ట్వీట్ చేశారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రీ కూడా ఇలాగే స్పందించారు. దేశానికి జీడీపీలో 8 నుంచి 10 శాతం విలువైన ఆర్థిక ప్యాకేజీని ముందు ప్రకటించాలని ట్వీట్ చేసిన ఆయన లాక్ డౌన్ సందర్భంగా ఉపాధిలేక తస్వస్థలాల బాట పట్టిన వేలాది కార్మికులకు, శ్రామిక జీవులకు వెంటనే వేతనాలు మంజూరు చేయాలని హితవు చెప్పారు. ఫేక్ న్యూస్ ని అణచివేత పేరుతో నిజమైన మాధ్యమాలను నోరు నొక్కొద్దంటూ మహువా తీవ్రంగా హెచ్చరించారు. మరోవైపు ఇదే విషయంలో తెలంగాణా విద్యుతు ఇంజనీర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పారిశ్రామిక డిమాండ్ భారీగా పడిపోయిన నేపథ్యంలో ఆకస్మికంగా అందరూ స్విచ్-ఆఫ్ చేస్తే గ్రిడ్ కూలిపోయే ప్రమాదముందని హెచ్చరించారు. కరోనా రోగులకు చికిత్స చేస్తున్న ఆసుపత్రులకు అవసరమైన విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా కరోనావైరస్ మహమ్మారితో దేశంలో అలుముకున్న చీకటితో పోరాడటానికి కొవ్వొత్తులు, మట్టి దీపాలు, లేదంటే కనీసం మొబైల్ టార్చి లైట్లను వెలిగించాలని, సామూహిక శక్తిని నిలపాలంటూ దేశ ప్రజలకు ఇచ్చిన ఒకవీడియో సందేశంలో ప్రధాని మోదీ విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే.

మహిళల జన్‌ధన్ ఖాతాల్లో నిధుల జమ

-వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): మహిళల జన్‌ధన్ ఖాతాలకు రూ.500 చొప్పున నిధులను విడుదల చేసినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ శుక్రవారం ప్రకటించింది. ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన పథకం క్రింద ఏప్రిల్ నెలకు ఈ నిధులను విడుదల చేసినట్లు తెలిపింది. ఏప్రిల్ రెండున ఈ నిధులను ఆయా బ్యాంకులకు అందజేసినట్లు తెలిపింది. కరోనా వైరస్ మహమ్మారితో పోరాడేందుకు అష్ట దిగ్బంధనాన్ని విధించిన నేపథ్యంలో ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన ప్యాకేజీని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ప్యాకేజీ క్రింద ప్రతి మహిళా జన్ ధన్ ఖాతాదారుకు నెలకు రూ.500 చొప్పున మూడు నెలలపాటు కేంద్ర ప్రభుత్వం అందజేస్తుంది. ఈ వివరాలను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ మార్చి 26న ప్రకటించిన సంగతి తెలిసిందే. లబ్దిదారులు ఒకరికొకరు దూరం పాటిస్తూ, క్రమబద్ధంగా నగదు ఉపసంహరించుకునేవిధంగా చర్యలు తీసుకోవాలని బ్యాంకులను గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ కోరింది. బ్యాంకుల శాఖలు, బ్యాంకింగ్ కరస్పాండెంట్లు, ఏటీఎంల వద్ద లబ్దిదారులు సామాజిక దూరం, అష్ట దిగ్బంధనం నిబంధనలను పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరింది.

గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం, మహిళా జన్ ధన్ ఖాతా సంఖ్యలో చివరి అంకె సున్నా కానీ, ఒకటి కానీ అయితే ఏప్రిల్ 3న నగదును ఉపసంహరించు కోవచ్చు. ఖాతా సంఖ్యలో చివరి అంకె 2 లేదా 3 అయితే ఏప్రిల్ 4న నగదు తీసుకోవచ్చు. ఖాతా సంఖ్యలో చివరి అంకె 4 లేదా 5 అయితే నగదును ఏప్రిల్ 7న తీసుకోవచ్చు. ఖాతా సంఖ్యలో చివరి అంకె 6 లేదా 7 అయితే ఏప్రిల్ 8న విత్‌డ్రా చేసుకోవచ్చు. ఖాతా సంఖ్యలో చివరి అంకె 8 లేదా 9 అయితే ఏప్రిల్ 9న నగదు తీసుకోవచ్చు. ఏప్రిల్ 9 తర్వాత కూడా లబ్దిదారులు బ్యాంకులకు వెళ్ళి, బ్యాంకు పని వేళల్లో నగదును ఉపసంహరించుకోవచ్చు. ఈ సమాచారాన్ని ఖాతాదారులకు బ్యాంకులు ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేయాలి. బ్యాంకులు, బ్యాంకు కరస్పాండెంట్లు, ఏటీఎంల వద్ద తగిన భద్రత ఏర్పాట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రదించాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్స్ కమిటీ కన్వీనర్లను గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ కోరింది. లబ్దిదారులు పద్ధతి ప్రకారం నగదు ఉపసంహరించుకునేందుకు వీలుగా చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వాల సహకారం తీసుకోవాలని తెలిపింది. కరోనా వైరస్ మహమ్మారి కారణంగా దేశ, విదేశాల్లో ఆర్థిక కార్యకలాపాలకు తీవ్ర విఘాతం ఏర్పడింది. ప్రజల ఆదాయాలపై పెను ప్రభావం పడింది. ముఖ్యంగా రోజువారీ ఆదాయంపై జీవించేవారు అష్టకష్టాలు పడుతున్నారు.

నేటి కవిత



మసీదుల్లో రహస్యంగా తలదాచుకుంటున్న తబ్లీగీ సభ్యులు

తనిఖీలకు ప్రభుత్వ అనుమతి కోరిన పోలీసులు
క్వారెంటయిన్ నిబంధనలు ఉల్లంఘించడంతో వైరస్ వ్యాప్తి

న్యూఢిల్లీఏప్రిల్4(ఆర్ఎన్ఎ): న్యూఢిల్లీలో జరిగిన మత ప్రార్థనలకు హాజరయ్యేందుకు వచ్చిన సుమారు 600 మంది విదేశీయులు ఢిల్లీ నగరం చుట్టుప్రక్కల ఉన్నటువంటి మసీదుల్లో తలదాచుకున్నారని గుర్తించారు. వారిని పట్టుకుని క్వారంటైన్ కేంద్రాలకు తరలించడానికి తమకు అనుమతి కావాలని కోరుతూ పోలీసులు ప్రభుత్వాన్ని కోరారు. తబ్లీగీ జమాత్ కార్యాలయం నుండి ఇప్పటికే సమారు రెండు వేల మందికి పైగా ప్రజలను క్వారంటైన్ కేంద్రాలకు తరలించారు. కాగా నగర శివారుల్లోని మసీదుల్లో ఇంకా 600 మంది దాకా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు, కాబట్టి ఆ మసీదుల్లో తనికీలు చేసి వారిని క్వారంటైన్ కేంద్రాలకు పంపిచేలా అనుమతించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న కరోనా వైరస్ గురించి ప్రభుత్వాలు ఎంతగా ప్రచారం చేస్తున్నా.. ప్రజల్లో పూర్తి అవగాహన రావడ ంలేదు. విదేశాల నుంచి వచ్చిన ప్రయాణికులు.. ఇక్కడికి రాగానే క్వారంటైన్‌లోకి వెళ్లాలనే కనీస జాగ్రత్తలు పాటించడంలేదు. దీంతో ఈ పరిణామాలు ప్రమాదకర పరిస్థితులకు దారి తీస్తున్నాయి. తమకు తాము ప్రమాదంలోకి జారిపోవడమే కాకు ండా.. తోటి వారిని, ఇరుగు పొరుగు వారిని సైతం ముప్పులోకి తీసుకెళ్తున్నారు. న్నో కుటుంబాలు విదేశీ ప్రయాణికులను దాచి పెడుతుండగా.. ప్రయాణికులు కూడా ముం దుకురావడానికి ఇష్టపడటం లేదు. స్థానికులు గుర్తించినా నేరుగా పోలీసులకు లేదా ఆరోగ్య శాఖాధికారులకు సమాచారం ఇవ్వడానికి వెనుకాడు తున్నారు. స్థానిక నేతలకు సమాచారం ఇచ్చినా.. వారు పట్టించుకోవ డం లేదు. బస్తీల్లో ఎవరెవరు విదేశాల నుంచి వచ్చారు, ఎవరెవరి ఆరోగ్య పరిస్థితులెలా ఉన్నాయనే సమాచారాన్ని అధికారులకు అందించాల్సిన నేతలు బాధ్యత మరిచి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొంతమంది ముదుర్లు.. విదేశాల నుంచి రాగానే ఇళ్లు వదిలి మరో బస్తీలో తాత్కాలిక నివాసముంటున్నట్లు తెలుస్తోంది. అవగాహన ఉన్నవారు, కుటుంబ సభ్యుల గురించి, ఇరుగు పొరుగువారి క్షేమం గురించి ఆలోచించేవారు.. భయపడాల్సిన అవసరమే లేదనే విషయాన్ని గుర్తించి నేరుగా ఆస్పత్రులకు చేరుకుంటున్నారు. ఒకవేళ ఆలస్యంగా వైరస్ వెలుగు చూస్తే భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందనే విష యాన్ని అందరూ గుర్తించి ముందుకు రావా లని వైద్యాధికారులు కోరుతున్నారు. మరో వైపు హోం క్వారంటైన్‌లో ఉన్నవారు కొంత మంది రోడ్లపై తిరుగుతున్నారనే ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. విషయం తెలిసిన పోలీ టులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అయినా నిబంధనలు ఉల్లంఘించడంతో ఆరోగ్యశాఖ అధికారులు అంబులెన్స్‌లో క్వారంటైన్ కేం ద్రాటనికి తరలిస్తున్నారు. ఇకపోతే హోం క్వారంటైన్‌లో ఉండాల్సిన వారు మాటిమా టికీ బయటకు వస్తున్నారు. ఇలా హోం క్వాంటంటైన్ ఉల్లంఘించమే కాదు.. ఢిల్లీ మర్కాజ్ ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాత స్థానికుల్లో తీవ్ర భయాందోళనలు రేకెత్తుతున్నాయి. దీంతో ఇతర రాష్ట్రాలు నగరాల నుంచి వచ్చిన వారిపైనా స్థానికులు దృష్టిపెంచారు.

మర్కజ్ వెళ్లి వచ్చిన కుటుంబం దుశ్చర్య

ఆశావర్కర్‌పై ఆదిలాబాద్‌లో దాడి

ఆదిలాబాద్,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): మర్కజ్ వెళ్లొచ్చిన వారి వివరాలు తెలుసుకునేందుకు వెళ్లిన ఆశా వర్కర్‌కు ఆదిలాబాద్‌లో చేదు అనుభం ఎదురయ్యింది. ఢిల్లీ నిజాముద్దీన్‌లోని మర్కజ్‌కు వెళ్లి వచ్చిన వారి వివరాలు అడిగినందుకు ఆశా వర్కర్‌ను ఇంట్లో బంధించారు. వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ జిల్లాలోని శివాజీ చౌక్‌లో ఓ అశా వర్కర్ మర్కజ్ వెళ్లి వచ్చిన ఓ వ్యక్తి ఇంటికి వెళ్లారు. దాంతో కోపోద్రిక్తులైన ఆ కుటుంబ సభ్యులు ఆమె వద్ద ఉన్న రిజిస్టర్‌ని లాగి చింపేశారు. అంతే కాదు మమ్ముల్ని అనుమానిస్తావా అంటూ ఆవేశంగా ఇంట్లో బంధించారు. ఒక్కసారే జరిగిన పరిణామాలకు ఆమె భయకంపితురాలైంది. దేశంలో కరోనాని అరికట్టాలని దేశం ఎన్నడూ లేని విధంగా లాక్ డౌన్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే గత నెల 13 న ఢిల్లీ నిజాముద్దీన్‌లోని మర్కజ్‌ప్రార్థనా మందిరంలో పాల్గొన్న వారిలో చాలా మందికి కరోనా వైరస్ ఎటాక్ చేసిందని అంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో మర్కజ్‌కు వెళ్లొచ్చిన వారి వివరాలు తెలుసుకునే పనిలో తెలుగు రాష్ట్ర అధికారులు పడ్డారు. అందులో భాగంగానే ఎ ఓ ఇంటికి వెళ్లి వివరాలు అడిగింది. అయితే వారు దాడి చేయడంతో వెంటనే తేరుకొని కుటుంబ సభ్యులను ప్రతిమిలాడి ఎలాగో అలా బయట పడింది. బయటకు రాగానే విషయాన్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

అసోంలో వివిధ మిలింట్ గ్రూపులకు చెందిన తీవ్రవాదులు లొంగిపోయిన దృశ్యం

గుళ్లూ,మసీదులు,చర్చిలకు వెళ్లకండి

కరో అదుపులో అంతా సహకరించాల్సిందే
లాక్‌డౌన్‌కు కట్టబడి ఇళ్లనుంచి రాకండి
మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపు

వరంగల్,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): కరోనా నేపథ్యంలో గుళ్లు,మసీదులు, చర్చిలకు వెళ్లడాన్ని కొంత కాలం ప్రజలు మానేయాలని పంచాయితీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లిదయాకర్‌రావు అన్నారు. సీఎం కేసీఆర్ కరోనాను అదుపు చేసేందుకు అవిశ్రాంతంగా పోరాడుతున్నారు. ప్రజా సంక్షేమానికి ఎంతకైనా వెళతారు. ప్రజల్నిరక్షించడానికి వైద్యులు, పోలీసులు, పారిశుద్ధ్య సిబ్బంది, ఉద్యోగులంతా నిరంతరం ప్రాణాలకు తెగించి పనిచేస్తున్నారు. ప్రజలు సహకరించాలని, కరోనా నిర్మూల న జరిగే వరకూ కంప్లీట్ లాక్‌డౌన్‌కి ఎట్టిపరిస్థితిలోనూ విఘాతం కలగకుండా చూడాలని ఆయన అన్నారు. మరింత కట్టుదిట్టంగా లాక్‌డౌన్‌ని నిర్వహించాలని, ప్రజలు ఎట్టిపరిస్థితిలోనూ ఇళ్లనుంచి బయటకు రావద్దని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్నలాక్‌డౌన్‌కి ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు వస్తున్నాయని అన్నారు. సంపూర్ణలాక్‌డౌన్ మన ఐక్యతను, నహనాన్ని , పోరాట పటిమను చాటుతున్నదని అన్నారు. వరంగల్ రూరల్ జిల్లాలోని పాలకుర్తి నియోజక వర్గం రాయపర్తి జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో మక్కల కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ఎర్రబెల్లి ప్రారంభించారు. తిరుమలయపల్లిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా మంత్రి ప్రారంభించారు. అలాగే రాయపర్తి వీధుల్లోసోడియం హైపోక్లోరైడ్‌ని స్వయంగా మంత్రి పిచికారీ చేశారు. ప్రజలకు మాస్కుల పంపిణీ,పేదలకు ఉచిత బియ్యం పంపిణీ చేశారు. పాలకుర్తి నియోజక వర్గంలో ప్రజలకు అవగాహన, చైతన్యం కల్పిస్తే విస్తృతంగా పర్యటించారు. ఈసందర్భంగా ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎంకేసీఆర్ ముందే మేల్కొని తీసుకున్ననిర్ణయం లాక్‌డౌన్‌కి ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు వస్తున్నాయని చెప్పారు. కరోనా ఫలానా తేదీ నాటికి తగ్గిపోతుందని భావిస్తున్న తరుణంలో దురదృష్టవశాత్తూ కొందరుఢిల్లీకి వెళ్లిరావడం, తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం, స్వచ్ఛందంగా పరీక్షలకు వెళ్లకుండా ఉండడం వంటి కారణాల వల్ల కరోనా విస్తృతి మరికొంత జరిగిందన్నారు. అయినా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దీనికితగ్గట్టుగానే అనేక ఏర్పాట్లు చేసిందన్నారు. కరోనా నిర్మూలనకు చికిత్సకంటే అది రాకుండా చూసుకోవడమే మంచిదన్నారు. అందుకే ప్రజలు మరికొంత కాలం లాక్‌డౌన్‌ని కట్టుదిట్టంగా పాటించాలని మంత్రి సూచించారు. పారిశుద్ధ్యం విషయంలోనూ ప్రజలు క్రమశిక్షణతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రూరల్ అడిషనల్ కలెక్టర్ మహేందర్‌రెడ్డి,స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో మరింత కఠినంగా ఆంక్షలు

స్క్రీనింగ్ నిర్వ హిస్తున్న వైద్య బృందాలు

కరీంనగర్,ఏప్రిల్4(నేటినిజం ప్రతినిది): జిల్లాలోని కరోనా ప్రభావిత ప్రాంతాల్లో ఆంక్షలను అధికారులు మరింత కఠినతరం చేశారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో మర్కజ్ వెళ్లి వచ్చిన వారితో పాటు వారితో ప్రైమరీ కాంటాక్ట్ అయిన వారిని గుర్తించి వారికి వైద్య బృందాలు స్క్రీనింగ్ నిర్వహిస్తున్నాయి. జిల్లాలో రోజురోజుకు పాజిటివ్ కేసులు పెరుగుతుండటంతో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు డాక్టర్లు. అంతేకాదు దగ్గు, జలుబు, జ్వరం కోసం నేరుగా మందులు కొనుక్కునేందుకు వచ్చే వాళ్లకు మెడిసిన్స్ ఇవ్వొద్దని మెడికల్ షాప్ యజమానులకు ఆదేశాలు జారీ చేశారు జిల్లా కలెక్టర్. కరోనా లక్షణాలు ఉన్న వాళ్లకు ట్రీట్మెంట్ చేయవద్దని సూచించారు. లాక్ డౌన్, కర్ఫ్యూ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జగిత్యాల జిల్లా నుంచి మార్కెట్ కు వెళ్లి వచ్చిన వారిలో కొందరిని పొలాస వ్యవసాయ కాలేజీలో, మరికొందరిని ఏఐ÷జ క్వారంటైన్ కు తరలించారు అధికారులు.

పెద్దపెల్లి జిల్లాలో తొలి కరోనా కేసు నమోదైంది. ఢిల్లీలోని మర్కజ్ ప్రార్థనలకు వెళ్లి వచ్చిన వారిలో జిల్లాలోని ఐ÷ఖఅ అన్నపూర్ణ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి కరోనా పాజిటివ్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. పాజిటివ్ కేసు నమోదు కావడంతో అల్టంల్గ÷న జిల్లా అధికార యంత్రాంగం ఎన్‌టిపిసి అన్నపూర్ణ కాలనీ తో పాటు పరిసర ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టారు. కాలనీల్లో బ్లీచింగ్ నిర్వహి ంచారు. కరోనా సోకిన వ్యక్తి కుటుంబ సభ్యులు, బంధువులను ఇప్పటికే క్వారంటైన్ కేంద్రానికి తరలించారు. కరోనా సోకిన వ్యక్తితో సన్నిహితంగా ఉన్న వారి సమాచారం తెలుసునే పనిలో ఉన్నారు అధికారులు. మొదటి కేసు నమోదు కావడంతో పెద్దపెల్లి జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో జిల్లాలో లాక్ డౌన్ మరింత కఠినంగా చేపట్టాలని నిర్ణయించారు.

లాక్‌డౌన్‌తో వైన్‌షాపులో చోరీ

గాంధీనగర్‌లో భారీ మొత్తంలో సరుకు దొంగతనం

హైదరాబాద్,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ నేపథ్యంలో కొందరు దొంగలు తమవంతు కార్యాన్ని చక్కబెడుతున్నారు. లాక్‌డౌన్‌తో మద్యం దుకాణాలు బంద్ అయిన విషయం తెలిసిందే. అయితే కొంతమంది తమ చోరకళను ప్రదర్శిస్తూ వేలకు వేల రూపాయలు విలువ చేసే మద్యాన్ని దొంగలిస్తున్నారు.

తాజాగా గాంధీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీ వేంకటేశ్వర వైన్స్ షాప్‌లో మద్యం లూటీ జరిగింది. షాప్ పైభాగం రేకులు కట్ చేసి లోపలికి ప్రవేశించిన దొంగ.. అరవై వేల రూపాయల విలువైన బాటిల్స్‌ను ఎత్తుకెళ్లాడు. అంతేగాక నగదు కూడా చోరీ చేశాడు.

ఇది సీసీటీవీలో రికార్డ్ అయ్యింది. వీడియోల ఆధారంగా పోలీ సులు దర్యాప్తు జరుపుతున్నారు. అయితే ఈ న ఎల 1న జరిగి ఉం టుందని షాపు ఓనర్ చెప్పాడు. షాప్ బంద్ కావడంతో పట్టించుకోలదన్నారు.

కెటిఆర్‌కు పలువురు చెక్కుల అందచేత

గీతం వర్సిటీ ఛైర్మన్ 25 లక్షల విరాళం

హైదరాబాద్,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న కరోనా మహమ్మారిని తుదముట్టించేందుకు ప్రభుత్వాలు తీవ్ర కృషి చేస్తున్నాయి. కరోనా నివారణ చర్యలలో తమ వంతు సాయంగా సినీ సెలబ్రిటీలు, పలువురు ప్రముఖులు సీఎం సహాయనిధికి భారీగా విరాళాలు అందిస్తున్నారు.

తాజాగా బాలకృష్ణ అల్లుడు, గీతం ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఛైర్మన్ శ్రీ భరత్ .. తెలంగాణ మంత్రి కేటిఆర్‌ని కలిసి తెలంగాణ సీఎం సహాయనిధి కోసం రూ.25 లక్షల చెక్‌ని అందించారు. భరత్‌తో బాలకృష్ణ, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, గీతం టీం సభ్యులు ఉన్నారు.

మరోవైపు కరోనా కట్టడి కోసం భరత్ .. ఆంధ్రప్రదేశ్ సీఎం సహాయనిధి కోసం రూ.50లక్షలు, మహారాష్ట్ర సీఎం సహాయనిధి కోసం రూ.25 లక్షలు అందించనున్నారు. మొత్తంగా ఆయన కరోనా సహాయక చర్యల కోసం రూ. 1 కోటి రూపాయల విరాళాన్ని అందిస్తున్నారు. గత కొన్ని రోజులుగా లాక్ డౌన్ కారణంగా పేద ప్రజల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పలువురు సెలబ్రిటీస్, రాజకీయ నాయకులు భారీగా విరాళాలు ప్రకటిస్తున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ ఎమ్మెల్యే , సినీ నటుడు నందమూరి బాలకృష్ణ తన వంతు సాయంగా కోటి రూ.25 లక్షల విరాళం ప్రకటించారు. ఇందులో తెలంగాణ,ఏపీలకు చెరో రూ.50 లక్షలు ఇచ్చారు. చిరంజీవి ఆధ్వర్యంలో సినీ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సీసీసీ(కరోనా క్రైసిస్ ఛారిటీ)కి రూ.25 లక్షలు ఇచ్చారు. ఈ చెక్కును ప్రొడ్యూసర్ సీసీసీ సభ్యుడు సి.కళ్యాణ్ కు అందజేశారు.

. కరీంనగర్‌కు చెందిన చర్చి ఫాదర్ రెవరెండ్ రూబెన్ మార్క్‌ను అభినందించిన మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్.

కొవ్వొత్తుల డ్రామా కాదు

పేదలకు ఏం చేస్తారో చెప్పండి: ఓవైసీ

హైదరాబాద్,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): కరోనా నేపథ్యంలో రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఏ సాయం చేస్తుందో చెప్పండని ఎంపి అసదుద్దీన్ ఓవైసీ ప్రశ్నించారు. ప్రణాళిక లేకుండా లాక్‌డౌన్ ప్రకటించి పేద ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆర్థిక సాయం అందించాలని కోరితే ప్రధాని మోదీ మాత్రం మీ ఇంట్లోని లైట్లను ఆర్పేయండని పిలుపునిస్తున్నారని ఎద్దేవా చేశారు. మా జీవితాలను 9 నిమిషాల జిమ్మిక్కులతో తగ్గించొద్దన్నారు. పేదలకు ఎలాంటి సహాయం అందిస్తారో చెప్పండి. అసంఘటిత రంగంలో లక్షలాది మంది పేదలు ఆకలితో అలమటిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇళ్లకు వెళ్లేందుకు వలస కార్మికులు ఎదురుచూస్తున్నారు. వీటన్నింటిని విస్మరించి బదులుగా కొత్త డ్రామాతో మా ముందుకు వచ్చారని ఓవైసీ మండిపడ్డారు. దేశంలో కరోనా చీకట్లు తొలగించేందుకు ఆదివారం రాత్రి 9 గంటలకు ప్రతి ఇంట్లో లైట్లు ఆర్పేసి టార్చ్‌లైట్లు, కొవ్వొత్తులు, దీపాలు వెలిగించడం ద్వారా సమష్టిగా సంకల్పం చాటాలని ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు ఇచ్చిన పిలుపుపై ఏఐఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ మండిపడ్డారు. లాక్‌డౌన్ సమయంలో ఉపాధి కూలీలు, వలస కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి కోసం ఆర్థిక సహాయం లేదా ఎలాంటి ఉపశమనం కలిగించే ప్రకటన చేయలేదని ట్విటర్లో విమర్శించారు. ఈ దేశం ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ కాదు.

మద్యం మత్తులో బావిలో పడి వ్యక్తి మృతి

కర్నూలు,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): మద్యం మత్తు ఓ యువకుడి ప్రాణాలు తీసింది. మద్యం మత్తులో నిద్రలోకి జారుకున్న అతను బావిలో పడి చనిపోయాడు. వివరాల్లోకి వెళితే... కర్నూలు మండలం రేమట గ్రామానికి చెందిన బోయ శివ(24) కొట్టాల గ్రామంలో వివాహం చేసుకున్నాడు. భార్య ఏడు నెలల గర్భిణి కావడంతో పుట్టింటికి వెళ్లింది. భార్యను చూసేందుకని శివ కొట్టాలకు వెళ్లాడు. అదే గ్రామానికి చెందిన ఇద్దరు స్నేహితులతో కలిసి శుక్రవారం సమీపంలోని పొలాల్లోకి విందు చేసుకునేందుకు వెళ్లారు. అక్కడ పూటుగా మద్యం తాగారు. విశ్రాంతి తీసుకుందామని నిద్రకు ఉపక్రమించారు. మద్యంమత్తులో ఉన్న శివ కాసేపటికే సమీపంలో ఉన్న బావిలో పడిపోయాడు. స్నేహితులు సాయంత్రం నిద్రలేచేసరికి శివ కనిపించకపోవడంతో బావిలో చూడగా మృతదేహం తేలియాడుతుండటం చూసి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు.

శివ మృతదేహాన్ని రేమటకు తీసుకురావడం తెలుసుకున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ గ్రామానికి చేరుకున్నారు. మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట రేమట సుదర్శన్‌రెడ్డి, ఉల్చాల వాసు, రేమట ఎంపీటీసీ అభ్యర్థి కాల్వమునిస్వామి, సంపత్, తిరుమల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కరోనా నుంచి బయటపడ్డ జర్నలిస్ట్

భోపాల్ ఎయిమ్స్ నుంచి తండ్రీకూతుళ్ల డిశ్చార్జ్

భోపాల్,ఏప్రిల్4(ఆర్ఎన్ఎ): మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ జర్నలిస్టు, అతని కూతురు కరోనా నుంచి కోలుకున్నారు. తొలుత వారికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయిన విషయం విదితమే.

జర్నలిస్టు కూతురి ద్వారా ఆయనకు కరోనా సోకింది. భోపాల్‌లోని ఎయిమ్స్ ఆస్పత్రి ఐసోలేషన్ వార్డులో చికిత్స అ